ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనంతపురం

జిల్లా వార్తలు

బుధవారం 19 ఫిబ్రవరి 2025

హత్యా..? ఆత్మహత్యా..?

ఇంటర్ విద్యార్థి అనుమానాస్పద మృతి



కన్నీటి సంద్రంలో శ్రీకాంత్ కుటుంబ సభ్యులు ←

7



శ్రీకాంత్(ఫైల్)

నేటి నుంచి శివరాత్రి బ్రహ్మోత్సవాలు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. బుధవారం నుంచి మార్చి 1వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆలయానికి నూతన రంగులు వేయడంతోపాటు ఆలయ పరిసరాలను రకరకాల విద్యుద్దీపాలతో అలంకరించారు. కాశీవిశ్వేశ్వరస్వామిని రోజుకొక వాహనంపై ఆశీనులు గావించి పురవీధుల్లో ఊరేగించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి రమేష్‌బాబు పేర్కొన్నారు.



విద్యుద్దీపాల వెలుగుల్లో కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం, అలంకరణలో కాశీవిశ్వేశ్వరస్వామి

సమరోత్సాహం..!



గుత్తి రూరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): తొండపాడు బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాతిదూలం పోటీలు ఉత్సాహంగా సాగాయి. సీనియర్ విభాగంలో నంద్యాల జిల్లా గుంప్రమాన్‌దిన్నె రైతు రాంభూపాల్‌రెడ్డి ఎద్దులు 3,962 అడుగుల దూరం లాగి మొదటి బహుమతి రూ.75 వేలు గెల్చుకున్నాయి. కడప జిల్లా కల్లూరుకు చెందిన శివకృష్ణయాదవ్ ఎద్దులు 3,932 అడుగులు లాగి రెండో బహుమతి రూ.60 వేలు కైవసం చేసుకున్నాయి. అనంతపురం జిల్లా ఎ.నారాయణపురానికి చెందిన మధుసూదన్‌రెడ్డి ఎద్దులు 3,900 అడుగులు లాగి మూడో బహుమతి రూ.40 వేలు దక్కించుకున్నాయి. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పోటీలను ప్రారంభించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఆలయ కమిటీ ఛైర్మన్ రంగస్వామి రెడ్డి యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

సర్వజన ఆస్పత్రికి వైద్య పరికరాలు



యంత్రాన్ని పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టరు భీమసేనాచారి

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజనాస్పత్రిలో రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విలువైన పరికరాలు సరఫరా చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు తెలిపారు. రూ.4.8కోట్ల విలువైన పరికరాలు, యంత్రాలు ఆస్పత్రికి వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. గ్యాస్ట్రో ఎండోస్కోపీ యంత్రం, ఫెక్సిబుల్ వీడియో బ్రాంకోస్కోపీ, పోర్టబుల్ అల్ట్రాసౌండ్, 2డి ఎకోయంత్రాలు, హైఎండ్ అల్ట్రాసౌండ్ యంత్రాలు, న్యూరోమస్కులర్ మానిటర్స్, బేసిక్ అల్ట్రాసౌండ్ సిస్టమ్స్, డెఫిబ్రిలేటర్స్, సీటీజీమిషన్లు ఆస్పత్రిలోని వివిధ విభాగాలకు వచ్చినట్లు తెలిపారు. క్రిటికల్ కేర్ సెంటర్‌కు సైతం ముందుగానే పరికరాలు మంజూరయ్యాయన్నారు. ఓటీ టేబుల్స్, ఎల్‌డీఆర్ టేబుల్స్, ఎలెక్ట్రో సర్జికల్ యూనిట్, రేడియంట్ వార్మర్, అల్ట్రాసౌండ్ సిస్టమ్, ఐసీయూ కాట్స్ వచ్చాయన్నారు. ఈయంత్రాలను ఆయా విభాగాలలో ఏర్పాటు చేయించి రోగులకు వైద్యసేవలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

జీతం చాలదని.. సైడ్ బిజినెస్!

ఆంధ్రాలో ఉద్యోగం.. కర్ణాటకలో విధులు

- చుట్టపుచూపుగా వస్తున్న ఇద్దరు డాక్టర్లు
- బళ్లారిలో ప్రైవేట్ ప్రాక్టీస్‌లో బిజీబిజీ
- కర్నూలులో ఉంటూనే హాజరు వేస్తున్న మరో ఉద్యోగి
- జిల్లా సరిహద్దు వైద్యశాలల్లో ఇద్దరు వైద్యుల దర్పం

వారు ప్రభుత్వ డాక్టర్లు. ఇక్కడ ఆస్పత్రులకు హాజరైనట్లు పక్కాగా రికార్డు చూపుతారు. కానీ విధులు మాత్రం పక్క రాష్ట్రంలో నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ యాప్‌లో పక్కాగా హాజరు నమోదు చేస్తూ పక్క రాష్ట్రంలో సంపాదనలో బిజీగా ఉంటున్నారనే విమర్శలు మూటగట్టుకుంటున్నారు. జిల్లా సరిహద్దులోని బొమ్మనహాళ్ మండలంలో పని చేసే ఇద్దరు ప్రభుత్వ వైద్యులు పోటీ పడి కర్ణాటకలో క్లినిక్‌లు నిర్వహిస్తున్నారు. ప్రశ్నిస్తే రాజకీయ పలుకుబడిని ఉపయోగించి నోళ్లు మూయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బొమ్మనహాళ్‌లో ఉండే వైద్యశాలతో పాటు అదే మండలంలోని శ్రీధరఘట్ట పీహెచ్‌సీలో విధులు నిర్వహించే వైద్యులు వివాదాలకు కేంద్ర బిందువులుగా మారారు. 24 గంటల పాటు రోగులకు అందుబాటులో ఉండాల్సిన వైద్యులు కర్ణాటకలో ఉంటూ చుట్టపు చూపుగా విధులకు హాజరవుతున్నట్లు స్థానికులు విమర్శిస్తున్నారు. అయితే ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టమ్ యాప్‌లో మాత్రం హాజరు తప్పకుండా ఉంటోంది.

- ఆంధ్రజ్యోతి, రాయదుర్గం




శ్రీధరఘట్ట వైద్యశాల

24 గంటల అందుబాటుకు డుమ్మా

ఈ ఇద్దరు పని చేసే ఆస్పత్రుల్లో వైద్యులు 24 గంటల పాటు వైద్యశాలకు అందుబాటులో ఉండాలి. దీనికి సంబంధించి కాల్‌డ్యూటీ పేరుతో వారికి ప్రభుత్వం విధులను అప్పగించింది. కానీ వీరు కర్ణాటకలో ఉంటుండటంతో అత్యవసర సమయంలో వైద్యులు చేయాల్సిన డ్యూటీని అక్కడుండే నర్సులే చేస్తున్నట్లు తెలిసింది. 24 గంటలు తెరుచుకుని ఉండాల్సిన ఆసుపత్రిలో ఓపీలు మాత్రం నిర్వహించి సాయంత్రానికి మూసివేసి ఇంటికి వెళ్లిపోతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం పేద ప్రజల వైద్యం కోసం కోట్లు ఖర్చు పెడుతున్నా ఇలాంటి కొందరి వల్ల అవసరమైన వైద్యం అందడం లేదనే విమర్శలు వినవస్తున్నాయి.







బొమ్మనహాళ్ వైద్యశాల

కాపాడుతున్న యాప్ లొసుగులు

ఉద్యోగులు సక్రమంగా విధులకు హాజరవడం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్‌లో లొసుగులను ఈ ఇద్దరు డాక్టర్లు చక్కగా ఉపయోగించుకుంటున్నారు. విధులకు డుమ్మా కొడుతూ, డ్యూటీకి వచ్చినట్లు రికార్డులు సృష్టిస్తున్నారు. కర్ణాటకలోని బళ్లారి ప్రాంతంలో ఉంటూ సమయానికే యాప్‌లో హాజరు వేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. విధులకు హాజరైన తేదీలను పరిశీలించి లొకేషన్‌లను గమనిస్తే కచ్చితంగా దొరికిపోతారని స్థానిక ప్రజలు చెబుతున్నారు. లోకేషన్‌లతో పాటు సీసీ కెమెరాలను పరిశీలిస్తే వీరు ఎంతమాత్రం వైద్య సేవలు అందిస్తున్నారో అర్థం అవుతుందని వారు పేర్కొంటున్నారు. శ్రీధరఘట్ట ఆస్పత్రిలో పని చేయాల్సిన వైద్యుడు బళ్లారిలో ప్రైవేటు ఆసుపత్రిని నడుపుతూ ప్రాక్టీస్ చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ విధులకు డుమ్మాకొట్టి ఎక్కువ సమయం ప్రైవేట్ ప్రాక్టీస్‌లోనే ఉంటున్నట్లు సమాచారం. బొమ్మనహాళ్ వైద్యశాలలో పనిచేసే డాక్టర్ బళ్లారిలోని ప్రైవేట్ నర్సింగ్ హోంలో ప్రాక్టీస్ చేస్తూ రెట్టింపు ఆదాయాన్ని గడించే పనిలో బిజీగా ఉన్నట్లు విమర్శలు గుప్పుమంటున్నాయి.

ఉపేక్షిస్తున్న ఉన్నతాధికారులు

జిల్లా సరిహద్దులో ఉన్న బొమ్మనహాళ్ మండలంలోని ఇద్దరు వైద్యుల వ్యవహారం ఉన్నతాధికారులకు తెలిసినా తెలియనట్లుగా నటిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పలు సందర్భాల్లో వీరిపై ఫిర్యాదులు అందినప్పటికీ పట్టించుకోవడం లేదని సమాచారం. బొమ్మనహాళ్‌లోనే పనిచేసే మరో ఉద్యోగి కర్నూలులో నివాసం ఉంటూ అక్కడి నుంచే యాప్‌లో హాజరు వేసి దర్జాగా వేతనాన్ని తీసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడుండే వైద్యులు ఈ విషయాన్ని దాచిపెట్టడంతో పాటు ఉన్నతాధికారులు ప్రశ్నించకుండా ఉండేందుకు కొంతసొమ్మును నెలవారీగా ముట్టజెబుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అందుకే ఉన్నతాధికారులు మౌనం వహించినట్లు ఆ శాఖలో చర్చ సాగుతోంది.



ఉష్ణోగ్రతలు

గరిష్ఠం	36.0
కనిష్ఠం	21.0

అప్పనంగా కాజేశారు

రూ. కోట్ల విలువైన దళితుల భూమిని కొట్టేసిన వీఆర్వో

జంతులూరు సెంట్రల్ యూనివర్సిటీ వద్ద 'భూ' మాయ.. టీడీపీ సానుభూతిపరుడైనందుకే కక్ష సాధింపు

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 18: మండలంలో సెంట్రల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసిన ప్రాంతంలో భూముల ధర రూ.కోట్లకు పెరిగింది. దీంతో ఓ వీఆర్వో రెవెన్యూ మాయ ప్రదర్శించాడు. ఈక్రమంలోనే ఏమాత్రం భయం లేకుండా రెండున్నర ఎకరాల భమిని తమన భార్య పేరు మీద ఆన్‌లైన్ చేసుకున్నాడు. ఇందుకు తహసీల్దార్, రెవెన్యూ కార్యాలయంలో పనిచేస్తున్న కింది స్థాయి సిబ్బంది వీఆర్వోకు పూర్తి సహకారం అందించారు. జంతులూరు గ్రామానికి చెందిన దళిత రాజేశ్వరికి చెందిన రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని ఆ వీఆర్వో రికార్డులు తారుమారు చేసి కొట్టేశాడు. ఈ సంఘటనపై ఆమె రెవెన్యూ అధికారులను ఆశ్రయించింది. వివరాలు ఇలా.. జంతులూరు గ్రామానికి చెందిన జే నాగేశ్వరమ్మ, భర్త లక్ష్మీనారాయణకు 2014లో సర్వేనెంబరు 276-4లో 2.50 ఎకరాల భూమిని ప్రభుత్వం పట్టాగా ఇచ్చింది. ఏడేళ్ల పాటు వారు పంట సాగు చేశారు. 2023లో జే నాగేశ్వరమ్మ పేరు మీద ఉన్న భూమి మండలంలో పనిచేస్తున్న వీఆర్వో కుమారుస్వామి భార్య విజయలలిత పేరు మీదకు మారింది.

టీడీపీ ఏజెంటుగా కూర్చున్నారని..

నాగేశ్వరమ్మ భర్త లక్ష్మీనారాయణ 2019 ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రంలో టీడీపీ ఏజెంటుగా కూర్చున్నాడు. దీన్ని మనసులో పెట్టుకున్న వైసీపీ నాయకులు కుట్రతో భూమిలేకుండా చేయాలని కంకణం కట్టుకున్నారు. ఈ విషయంపై వైసీపీ నేతలు పక్క గ్రామంలో పని చేసే వీఆర్వోని ఆశ్రయించారు. దళితురాలి పేరు మీద ఉన్న భూమిని తొలగించేందుకు వీఆర్వో అంగీకరించారు. అయితే దాన్ని తన భార్య పేరిట మార్చు కునేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. వైసీపీ నేతల సహకారంతో ఆ వీర్వో రెవెన్యూ కార్యాలయంలో పనిని సులభంగా చక్కగా చెక్కబెట్టుకున్నాడు.

ఆత్మహత్య చేసుకుంటా



కేవలం టీడీపీ తరఫున ఏజెంటుగా కూర్చున్నానే కక్షతోనే మా భూమిని వైసీపీ నేతలు మాకు కాకుండా చేశారు. గతంలో జంతులూరు, గోవిందంపల్లి గ్రామాలలో పని చేసిన వీఆర్వో కుమారుస్వామి రికార్డులు తారుమారు చేసి ఆన్‌లైన్‌లో నా భార్య పేరును తీయించాడు. నా భూమిని వీఆర్వో భార్య పేరిట 2023లో ఆన్‌లైన్‌లోకి మార్చుకున్నాడు. తహసీల్దార్ రమాదేవి, వీఆర్వో కుమారుస్వామి, వైసీపీ నేతలు కుట్రపన్ని నా భూమిని నాకు లేకుండా చేశారు. నా భూమి నాకు ఇవ్వకపోతే... ఆత్మహత్య చేసుకుంటా.

- లక్ష్మీనారాయణ, బాధితుడు

విచారణ చేస్తాం

దళితలకు ఇచ్చిన ప్రభుత్వ భూమిని వీఆర్వో భార్య పేరిట ఆన్‌లైన్‌లోకి ఎలా ఎక్కించారని అనే దానిపై విచారణ చేస్తాం. పూర్తిస్థాయిలో బుక్కరాయసముద్రం మండల తహసీల్దార్ నివేదిక ఇవ్వాలని ఆదేశిస్తా. నివేదిక వచ్చిన అనంతరం రికార్డులను పరిశీలించి వీఆర్వో భార్య పేరిట ఉన్న భూమిని తొలగిస్తాం. అనంతరం విచారణ చేసి శాఖా పరమైన చర్యలు తీసుకుంటాం.

- కేశవనాయుడు, ఆర్డీఓ

వస్తే.. భూమి.. లేదా.. పరిహారం..!

సర్వే నెంబరు 276-4లో ఉన్న 2.5 ఎకరాల భూమిలో పేద ప్రజలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వం 2023లో నిర్ణయించింది. ఎకరాకు రూ. 25 లక్షల నుంచి రూ. 30లక్షల పరిహారం చెల్లించే విధంగా అప్పట్లో రెవెన్యూ అధికారులు నిర్ణయించారు. కొన్ని కారణాల వలన ఇంటి పట్టాలు ఇవ్వలేదు. అయితే ఆ వీఆర్వో మాత్రం ఈ భూమిని తన భార్య పేరుపై ఆన్‌లైన్‌కి మార్చుకుంటే పరిహారం సొమ్ము వస్తుంది. అలాకాకుంటే భూమి అయినా మిగిలిపోతుంది కదా అని భావించాడు. ఈ క్రమంలోనే మాయతో పొలం కాజేశాడు.

సెంట్రల్ యూనివర్సిటీ వద్ద వీఆర్వో కాజేసిన భూమి ఇదే..



చెప్పిందే రేటు..!

ఉద్యాన పంటపై దళారుల పడగ

- తక్కువ ధరకు కొనుగోలు
- డబ్బుల చెల్లింపులోనూ జాప్యం
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు



అరటి కాయలను లోడింగ్ చేస్తున్న దృశ్యం



యల్లనూరు/పుట్లూరు ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఉద్యాన రైతులను దళారీలు నిలువునా దోచేస్తున్నారు. ఉద్యాన పంట ఉత్పత్తులకు వారే ధరలు నిర్ణయిస్తున్నారు. మార్కెట్ ధరల కన్నా వేల రూపాయలు తక్కువకు కొనుగోలు చేసి, అన్నదాతను మోసం చేస్తున్నారు. దళారుల చేతిలో రైతులు కీలుబొమ్మలుగా మారి నిర్ణయించిన రేట్లకే ఉద్యాన పంటలను విక్రయిస్తున్నారు. పుట్లూరు, యల్లనూరు మండలాల్లో ఉద్యానవన పంటలైన అరటి, చీనీ, దానిమ్మ తదితర పంటలను ఎక్కువగా సాగుచేస్తున్నారు. పుట్లూరు మండలంలో చీనీ 5,480 ఎకరాలు, అరటి 7,500, దానిమ్మ 1,050 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. యల్లనూరు మండలంలో చీనీ 11,333 ఎకరాలు, అరటి 4,009, దానిమ్మ 1,232 ఎకరాల్లో సాగుచేస్తున్నారు. పండించిన పంటను అమ్ముకునే సమయంలో దళారుల చేతిలో తీవ్రంగా నష్టపోతున్నాడు. రైతులు పంట చేతికి వచ్చే సమయానికి మాత్రం ధర ఆశించినంతగా ఉంటోంది. విక్రయించాల్సిన సమయంలో కూడా ధర అలాగే ఉన్నప్పటికీ దళారులు మాయాజాలాన్ని ప్రదర్శిస్తూ రైతులను బురిడీ కొట్టిస్తున్నారు. ధరను తక్కువగా చూపుతూ మభ్యపెడుతున్నారు. ఇదెలా సాధ్యమని రైతులు ప్రశ్నిస్తే.. ఇతర రాష్ట్రాల్లో కూడా పంట చేతికి వచ్చిందనీ, దీంతో రేటు అమాంతం తగ్గిందంటూ నమ్మబలుకుతున్నారు. ఇప్పుడు విక్రయించకపోతే ఈ ధర ఉండదని రైతులను భయభ్రాంతులకు లోనుచేస్తున్నారు. దానిమ్మ టన్ను ధర రూ.1.50 లక్షల నుంచి రూ.1.80 లక్షల వరకు ఉండగా.. దళారుల ప్రమేయంతో ఏకంగా టన్నుపై రూ.30వేల నుంచి రూ.50వేల వరకు తగ్గించి, సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అరటి ధర సైతం టన్ను రూ.28వేలు ఉండడంతో రైతులు సంబరపడ్డారు. వారి సంతోషాన్ని ఆవిరి చేస్తూ దళారులు ఏకంగా టన్నుపై రూ.3వేల నుంచి 4వేలు తగ్గించేశారు. ఇలా ప్రతి ఉద్యాన పంటపై దళారులు గద్దల్లా వాలి రైతులను పీక్కుతుంటున్నారు.

లోకల్ దళారుల హవా

పుట్లూరు, యల్లనూరు మండలాల్లో లోకల్ దళారుల హవా సాగుతోంది. దళారులు నేరుగా రైతుల వద్దకు వెళ్లి ధరకు పంటను కొనుగోలు చేస్తారు. అనంతరం ఆ పంటను ఇన్‌ఫోటెడ్ కంపెనీలకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. అలా పంటను బట్టి రూ.4వేల నుంచి 3వేల వరకు మిగుల్చుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడకు వచ్చే వ్యాపారులు సైతం దళారులను ఆశ్రయించాల్సిందే. లేకపోతే ఆ వ్యాపారులను దరిదాపుల్లోకి కూడా రానీయకుండా చేస్తున్నారని తెలుస్తోంది. ఈ మధ్యనే కొందరు లోకల్ దళారులు కొన్నిచోట్ల సమావేశమై ధర నిర్ణయించినట్లు సమాచారం.

పంట విక్రయించినా అందని సొమ్ము

ఉద్యాన పంటలను దళారులే విక్రయించి సొమ్ము తీసుకుంటున్నా రైతులకు మాత్రం పూర్తిస్థాయిలో అందడం లేదు. కొంత మేర డబ్బు ఇచ్చి మిగిలిన సొమ్ము నెలరోజుల్లోపు రైతులకు ఇస్తున్నారు. కొందరు దళారులు పంట డబ్బు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. పెట్టుబడుల కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక దిక్కుతోచని స్థితిలో ఉంటున్నారు. పోలీసులను ఆశ్రయించినా.. ఫలితం లేదు. పండించిన పంట తీసుకెళ్లి తమకు డబ్బు చెల్లించలేదని రైతులు.. పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసిన దాఖలాలున్నాయి. ఆ సమయంలో మాత్రం పోలీసులు స్పందించి నామమాత్రంగా దళారులను పిలిపించి మందలించడమే తప్ప.. డబ్బు ఇప్పించిన పాపానపోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు మండలాల్లో పదుల సంఖ్యలో రైతులు పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. ఈ లావాదేవీల సమస్యలు తమ పరిధిలో ఉండవంటూ పోలీసులు తప్పించుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

దళారుల బెడద ఎక్కువైంది



రైతులకు మండలాల్లో ఉన్న లోకల్ దళారుల బెడద ఎక్కువైంది. ఇష్టారాజ్యంగా ధరలు నిర్ణయిస్తుండడంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. వారు చెప్పిన రేటుకే అమ్మాల్సి వస్తోంది. నేరుగా ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసే రైతులు తక్కువగా ఉండడం దళారులకు వరంగా మారింది.

- గోవర్ధన్‌రాజు, అరటిరైతు కడవకల్లు, పుట్లూరు మండలం



సాగుచేసిన అరటిపంట

అరటిలో కూడా దళారుల ప్రవేశం



పుట్లూరు మండలం అరటి, చీనీ పంటల్లో కూడా ప్రస్తుతం దళారులు ప్రవేశిస్తున్నారు. గతంలో రైతులే బెంగళూరు, హైదరాబాద్, చెన్నై తదితర ప్రాంతాలకు తీసుకుని, విక్రయించుకునేవారు. ప్రస్తుతం దళారులే గ్రామాల్లోకి వచ్చి టన్ను చీనీ, అరటి, దానిమ్మ ఫలానా రేటు ఉందంటూ రైతులను నమ్మబలుకుతూ కొనుగోలు చేస్తున్నారు.

- శివయ్యనాయుడు, అరటిరైతు, చెర్లోపల్లి,



ఏపుగా కాసిన దానిమ్మకాయలు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

అరటి, దానిమ్మ, చీనీ తదితర ఉద్యాన పంటలపై దళారుల ప్రమేయం ఉన్నట్లు మా దృష్టికి రాలేదు. రైతులు ఫిర్యాదు చేస్తే వీటిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, చర్యలు తీసుకుంటాం.



- ఉమాదేవి, ఉద్యాన శాఖాధికారి

పరిష్కరిస్తా.. లేదంటే నా డబ్బులు ఇస్తా..!

శ్రీరామిరెడ్డి పథకం కార్మికులకు ఎమ్మెల్యే అమిలినేని హామీ

సమ్మె విరమించిన కార్మికులు.. తప్పిన తాగునీటి ముప్పు



శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం/అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): సమ్మెకు దిగిన శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు భరోసా ఇచ్చారు. సమస్య గడువులోగా పరిష్కారమయ్యేలా చూస్తానని, లేదంటే కార్మికుల బకాయిలను తానే చెల్లిస్తానని హామీ ఇచ్చారు. దీంతో మంగళవారం రాత్రి సమ్మె ప్రారంభించిన కార్మికులు.. బుధవారం విరమించారు. బకాయి ఉన్న ఆరు నెలల జీతాలు, పీఎఫ్ వెంటనే చెల్లించాలని కార్మికులు సమ్మె బాట పట్టిన విషయం తెలిసిందే. కళ్యాణదుర్గం పంపుహౌస్ వద్ద బుధవారం బైఠాయించారు. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఫేజ్-1, ఫేజ్-4 పరిధిలోని కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో 292 మంది కార్మికులు ఉన్నామని, తమకు ఆరు నెలల వేతనం, 30 నెలల పీఎఫ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బకాయిలు చెల్లించేదాకా సమ్మెను విరమించబోమని స్పష్టం చేశారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు వారికి మద్దతుగా నిలిచారు. బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. క్యాసీ, క్యాప కమిటీల ప్రతిపాదనలను ఉపసంహరించాలని, లీటరు బేస్ విధానాన్ని రద్దు చేయాలని అన్నారు. సమస్యలను అధికారులకు, ప్రజాప్రతినిధులకు వివరించినా పట్టించుకోలేదని, అందుకే వారు సమ్మెకు దిగారని అన్నారు. ఎమ్మెల్యే అమిలినేని వారి వద్దకు వెళ్లి మాట్లాడారు. ఈ నెలాఖరు లోపు.. లేదా మార్చి 3వ తేదీలోపు సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. ఏదైనా సమస్య తలెత్తి, గడువులోగా సమస్య పరిష్కారం కాకుంటే తన సొంత డబ్బుతో కార్మికుల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీనికి సమ్మతించిన కార్మికులు.. సమ్మె విరమించారు. పంప్ హౌస్‌లో మోటార్లను ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. దీంతో ఉరవకొండ, కూడేరు, రాయదుర్గం, బెళుగుప్ప, మడకశిర, హిందూపురం ప్రాంతాల్లో నీటి సమస్య పరిష్కారమైంది. చర్చల్లో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, ఈఈ మురళీధర్‌రావు, డీఈ పాల్గొన్నారు.

అప్పుల పంట

- తగ్గిన కళింగర దిగుబడి
- వేసవిలోనూ ధర పతనం
- పెట్టుబడినీ కోల్పోతున్న రైతులు
- అప్పుల పాలయ్యామని ఆవేదన



యాడికి వద్ద సాగుచేసిన కళింగర పంట



వ్యాన్‌లోకి లోడ్ చేసిన కళింగర కాయలు

యాడికి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): అన్నదాత ఆరుగాల కష్టం నష్టాలను మిగిల్చింది. ప్రస్తుత సీజన్‌లో కళింగర సాగుచేస్తే మంచి లాభాలు ఆర్జించవచ్చు అనుకున్న రైతులు.. ప్రతికూల వాతావరణంతో నష్టాలు చవిచూడాల్సి వస్తోంది. పంట దిగుబడి, నాణ్యత తగ్గడంతోపాటు ధరలు కూడా పతనమయ్యాయి. అన్నదాత కష్టం నేలపాలైంది. మండలవ్యాప్తంగా సుమారు 400ఎకరాల్లో కళింగర పంట సాగు చేశారు. యాడికి, రాయలచెరువు, నగరూరు, లక్షుంపల్లి, చందన, కేశవరాయునిపేట తదితర గ్రామాల్లో కళింగర పంట పెట్టారు. కిలో విత్తనం రూ.28వేలతో కొనుగోలు చేసి, నాటారు. పంట పూత, పిందె వచ్చే సమయంలో చలి, మేఘావృత వాతావరణం దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపినట్లు రైతులు తెలిపారు. సస్యరక్షణ చర్యలు ఎన్ని చేపట్టినా అవి పంట దిగుబడిని పెంచలేకపోయాయి. ఎకరాకు 15 నుంచి 20 టన్నుల వరకు దిగుబడి రావాల్సి ఉంది. ఈసారి 7 నుంచి 10 టన్నులు మాత్రమే వస్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాలో కళింగర సాగుకు రూ.70వేల నుంచి రూ.90వేల వరకు పెట్టుబడులు పెట్టి సాగుచేసిన పంటలు దెబ్బతినడంతో రైతులు అప్పుల పాలవుతున్నారు.

తెల్లబూజు... పొడ...

చలి ప్రభావం, ఆకాశం మేఘావృతమై ఉన్న వాతావరణ పరిస్థితులు కళింగర పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపాయి. కళింగర కాయలపై తెల్ల పొడ ఎక్కువగా ఉన్నట్లు రైతులు తెలిపారు. కళింగర కాయ లోపలి భాగంలో తెల్లబూజు ఏర్పడి కాయ చెడిపోతున్నట్లు వాపోతున్నారు. తెల్లబూజు కారణంగా కాయలోపల తొర్ర ఏర్పడి తినడానికి పనికి రాకుండా పోతున్నట్లు తెలిపారు. పొడవచ్చిన కాయలను వ్యాపారులు కొనడం లేదు.

ధర పతనం

కళింగర గతంలో టన్ను రూ.18వేల నుంచి 22వేల వరకు ధర పలికిందని రైతులు చెబుతున్నారు. ఎకరాకు 10టన్నుల దిగుబడి వచ్చినా రైతుకు లాభం వచ్చేది. ప్రస్తుత సీజన్‌లో ఎకరాకు పది టన్నుల దిగుబడి వస్తున్నా.. ధర అమాంతం పడిపోయింది. టన్ను కళింగర ధర రూ.7వేల నుంచి 8వేలలోపే పలుకుతోంది. ఈ ధరకు విక్రయిస్తే పెట్టుబడి కూడా దక్కదు. వెరసి రైతులు నష్టాలు మూటగట్టుకుంటున్నారు. ప్రస్తుతం ఉన్న ధరల్లో పంట దిగుబడిని మార్కెట్‌కు తరలించలేక రైతులు స్థానిక వ్యాపారులకు విక్రయిస్తుండడం గమనార్హం.



పెట్టుబడి కూడా వచ్చేది కష్టమే..

2.50 ఎకరాల్లో కళింగర సాగు చేశా. రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టా. 25 టన్నుల వరకు దిగుబడి వస్తోంది. ప్రస్తుతం కళింగర టన్ను రూ.7వేల నుంచి 8వేలలోపే ధర పలుకుతోంది. పెట్టుబడి కూడా వచ్చేది కష్టమే. వాతావరణ ప్రభావంతో కళింగర దిగుబడి తగ్గింది. నాణ్యతలోపంతో ధర కూడా పడిపోయింది. దీంతో నష్టాలు తప్పట్లేదు.

-శేఖర్, రైతు, రాయలచెరువు

4.50 ఎకరాల్లో సాగు చేశా


4.50 ఎకరాల్లో కళింగర సాగుచేశా. వాతావరణ ప్రభావంతో పంట దిగుబడి తగ్గింది. కాయల నాణ్యతపై తెల్లపొడ, తెల్లబూజు ప్రభావం ఎక్కువగా ఉంది. దీంతో ధర కూడా తగ్గింది. కలింగర ఇతర ప్రాంతాలకు ఎగుమతి అయితే ధరలు పెరుగుతాయి. లోకల్ మార్కెట్‌లో వ్యాపారులు మాత్రమే కొనుగోలు చేస్తుండడంతో ధరలు బాగా పతనమయ్యాయి.

-రవికుమార్‌రెడ్డి, రైతు, లక్షుంపల్లి



సూక్ష్మసాయమూ లేదాయె..!

- సూక్ష్మ పోషకాల పంపిణీని అటకెక్కించిన వైసీపీ ప్రభుత్వం
- రైతులపై అదనపు భారం
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు



ముదిగుబ్బ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): తమది రైతు ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకున్న గత వైసీపీ పాలకులు.. చేతల్లో మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించారు. సబ్సిడీపై సూక్ష్మ పోషకాల పంపిణీని అటకెక్కించడమే ఇందుకు నిదర్శనం. కొత్త పథకాలను అమలు చేయకపోగా.. అప్పటికే రైతులకు అందుతున్న ప్రయోజనాలను అటకెక్కించి అన్యాయం చేశారు. టీడీపీ హయాంలో చిన్న, సన్నకారు రైతులకు సబ్సిడీపై సూక్ష్మపోషకాలు అందించేవారు. తద్వారా రైతులకు పెట్టుబడి భారం తగ్గేది. పంట దిగుబడులు ఆశాజనకంగా వచ్చి, లాభం చేకూరేది. 2019లో వైసీపీ అధికారం చేపట్టాక ఆ సూక్ష్మసాయాన్ని అటకెక్కించింది. ఐదేళ్లలో రైతులకు సబ్సిడీపై సూక్ష్మపోషకాలు అందించిన దాఖలాలు లేవు. దీంతో రైతులు బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అలా రైతులపై అదనపు భారం పడుతోంది. అసలే వ్యవసాయ పెట్టుబడులు పెరిగిపోయిన తరుణంలో ఇది అదనపు భారంగా మారింది. కూటమి ప్రభుత్వమైనా సూక్ష్మపోషకాలను సబ్సిడీకి అందజేయాలని రైతులు కోరుతున్నారు.

ఎంతో అవసరం

ప్రతి మొక్క తన జీవిత చక్రాన్ని పూర్తి చేసుకోవడానికి 19 మూలకాలను ఆహారంగా తీసుకుంటుంది. కొన్ని పోషకాలను ఎక్కువ మోతాదులో, మరికొన్నింటిని తక్కువగా వినియోగించుకుంటుంది. తక్కువ మోతాదులో తీసుకునే వాటిని సూక్ష్మ పోషకాలు అంటారు. జింకు, ఇనుము, రాగి, మాంగనీస్, బోరాన్, మాలిబ్డినం, క్లోరిన్, సోడియం, వెనేడియం, సిలికాన్ వంటివి సూక్ష్మ పరిమాణంలో మొక్కలకు అవసరమవుతాయి. ఇవి మొక్క ఎదుగుదలతోపాటు దిగుబడుల్లో ప్రధాన పాత్ర పోషిస్తాయి. వీటి లోపం ఏర్పడితే దిగుబడులు తగ్గుతాయి. జిల్లాలో జింకు, బోరాన్ లోపాలున్న భూములే ఎక్కువగా ఉన్నట్లు వ్యవసాయ అధికారులు గుర్తించారు. అలాగే క్షార గుణం ఉన్న నేలలను బాగు చేసేందుకు, వేరుశనగ పైరుకు జిప్సం వాడతారు. ఈ మూడు రకాల సూక్ష్మ పోషకాలను గత వైసీపీ ప్రభుత్వం కేజీ కూడా పంపిణీ చేయలేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అదనపు భారం

సాధారణంగా జింకులోపం ఉన్న వరి పైరుకు ఎకరాకు 20 కిలోలు, ఇతర పైర్లకు 10 కిలోల జింక్ సల్ఫేట్ వేస్తారు. ఇలా మూడు పైర్లకు ఒకసారిగానీ, మూడేళ్లకోసారిగానీ వేయాలి. బోరాన్ లోపం ఉంటే ఎకరాకు కేజీ బోరాక్స్‌ను ఆఖరి దుక్కిలో వేస్తారు. నల్ల చవుడు నేలలో ఎకరాకు దాదాపు 200 కిలోల జిప్సం వేసి దున్నుతారు. వేరుశనగ పైరుకు జిప్సం ఎంతో ముఖ్యం. తాలు గింజలు లేకుండా కాయ ఊరడానికి, నూనె శాతం పెరగడానికి ఎకరాకి దాదాపు 200కిలోల జిప్సం వేయాలి. ఇవన్నీ రైతులపై అదనంగా పడుతున్న పెట్టుబడి ఖర్చులు. గతంలో టీడీపీ ప్రభుత్వం రెండున్నర హెక్టార్ల వరకు భూమి కలిగిన చిన్న, సన్నకారు రైతులకు సబ్సిడీతో వీటిని అందించేది. ఒక్కోసారి వందశాతం సబ్సిడీ కూడా వర్తింపజేసేది. ఇది రైతులకు ఎంతో ఉపశమనం కలిగించేది. వైసీపీ అధికారం చేపట్టాక ఆ ఊసే మరిచింది. రైతులకు అన్యాయం చేసింది.

ప్రభుత్వానికి నివేదిక పంపాం

సబ్సిడీపై సూక్ష్మ పోషకాలు అందించాలని రైతులు కోరడంతో ఆ మేరకు ప్రభుత్వానికి నివేదిక పంపాం. వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి రైతులకు సూక్ష్మ పోషకాలు అందించేలా కృషి చేస్తాం.

- సత్యనారాయణ, ఏడీఏ, కదిరి

నాణ్యమైన దిగుబడి



మామిడి, దానిమ్మ, కలింగర పంటలకు జిప్సం, జింకు ఇతర సూక్ష్మ పోషకాలు చాలా అవసరం. టీడీపీ హయాంలో వందశాతం సబ్సిడీతో రైతులకు పంపిణీ చేశారు. వాటిని పంటకు అందించడం ద్వారా దిగుబడులు నాణ్యతగా వచ్చేవి. గత వైసీపీ ప్రభుత్వం సబ్సిడీపై సూక్ష్మ పోషకాల పంపిణీని పూర్తిగా నిలిపేసింది. బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేయడం ద్వారా అదనపు భారం పడుతోంది. కూటమి ప్రభుత్వం సబ్సిడీతో సూక్ష్మ పోషకాలను రైతులకు అందించాలి.

- వెంకటరాముడు, రైతు, పలించెర్లోపల్లి

పంట దిగుబడి తగ్గుతోంది




గతంలో టీడీపీ ప్రభుత్వం వేరుశనగ పంటకు ఎకరాకు 200 కిలోల జిప్సం సబ్సిడీపై అందించింది. వైసీపీ అధికారం చేపట్టాక ఆ ఊసే మరిచిపోయింది. చిన్న, సన్నకారు రైతులు.. ప్రైవేటు దుకాణాల్లో కొనలేకపోతున్నారు. సూక్ష్మ పోషకాలు వినియోగించకపోవడంతో పంట దిగుబడులు తగ్గి రైతులు నష్టపోతున్నారు. కూటమి ప్రభుత్వం జిప్సం సబ్సిడీపై అందించాలి.

- నరేంద్ర, రైతు, ముదిగుబ్బ

జేఎన్టీయూ రెగ్యులర్ వీసీగా సుదర్శనరావు

ఎస్కేయూకి వారం ఆగాల్సిందే..



అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ రెగ్యులర్ వీసీగా ప్రొఫెసర్ సుదర్శనరావు నియమితుడయ్యారు. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక రాష్ట్రవ్యాప్తంగా వర్సిటీల వీసీలు రాజీనామా చేశారు. ఈ క్రమంలో గతేడాది జులై 18న జేఎన్టీయూ ఇన్‌చార్జి వీసీగా ప్రొఫెసర్ సుదర్శనరావు బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పలు వర్సిటీలకు వీసీలను నియమించారు. అందులో భాగంగా జేఎన్టీయూ రెగ్యులర్ వీసీగా ప్రొఫెసర్ సుదర్శన రావుకు అవకాశం కల్పించారు.

వారం ఆగాల్సిందే...

రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది వర్సిటీలకు రెగ్యులర్ వీసీలను నియమించారు. వీటిలో ఎస్కేయూ లేకపోవడంతో ఉద్యోగ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. దీనికి తెరపడాలంటే మరో వారంరోజులు ఆగాల్సిందేనని తెలుస్తోంది. ఇన్‌చార్జి వీసీల నియామకం నుంచే జేఎన్టీయూ, ఎస్కేయూకి రెగ్యులర్‌గా ఎవరొస్తారన్న అంశంపై జోరుగా చర్చలు సాగాయి. అర్హత, అనుభవం తదితర కోణాల్లో ఎవరికి వారు బేరీజు వేసుకుంటూ వచ్చారు. జేఎన్టీయూకి ఇన్‌చార్జ్ పోయి రెగ్యులర్ పదం మాత్రమే మారుతుందన్న ఉద్యోగవర్గాల ఊహాగానాలు నిజమయ్యాయి. ఎస్కేయూకి ఇదే వర్తిస్తుందా? కొత్త పేరేమైనా వస్తుందా? అన్న చర్చలు వినిపిస్తున్నాయి.

మహిళ అదృశ్యం



వరలక్ష్మి (ఫైల్)

శెట్టూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన లింగారెడ్డి కుమార్తె వరలక్ష్మి (35) సోమవారం సాయంత్రం నుంచి కనిపించడం లేదని ఆమె తమ్ముడు మంజునాథరెడ్డి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వరలక్ష్మికి కర్ణాటకలోని తిప్పిరెడ్డిపల్లికి చెందిన నాగేంద్రతో వివాహమైంది. భర్తతో విభేదాల కారణంగా ఆమె కొన్నేళ్లుగా పుట్టింట్లోనే ఉంటోంది. ఈ నేపథ్యంలోనే సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె కనిపించలేదని తమ్ముడు ఫిర్యాదు చేశాడు.

లైనింగ్ తంటా..!

- లైనింగ్‌తో చివరి ఆయకట్టుకు సాగు నీరు
- హంద్రీనీవాపై రైతుల్లో అపోహలు కలిగిస్తున్న వైసీపీ
- సీఎం వద్దకు వెళ్లాలని అధికారపార్టీ ఎమ్మెల్యేల సన్నాహాలు



ప్రారంభమైన హంద్రీనీవా ప్రధాన కాలువ లైనింగ్ పనులు

పుట్టపర్తి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే కూటమి ప్రభుత్వం హంద్రీనీవా ఆధునికీకరణ పనులు చేపట్టింది. జీడిపల్లి రిజర్వాయర్ ప్రధాన కాలువ నుంచి పుంగనూరు ఉపకాలువ దాకా లైనింగ్ నిర్మాణం చేపట్టనున్నారు. ఇందుకు రూ.1368 కోట్ల నిధులు కేటాయించారు. తాజాగా రెండోదశ లైనింగ్ పనులను మొదలు పెట్టారు. అయితే ఐదేళ్ల పాలనలో హంద్రీనీవాను పట్టించుకోని వైసీపీ ఇప్పుడు లైనింగ్ నిర్మాణంతో భూగర్భ జలాలు అడుగంటి, పచ్చని పొలాలు బీళ్లుగా మారుతాయని ప్రచారం మొదలు పెట్టింది. రైతుల తరఫున అల్టిమేటం అంటూ ఇటీవల రాప్తాడు వైసీపీ మాజీ ఎమ్మెల్యే రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో కొందరు అధికార పార్టీ ఎమ్మెల్యేలు హంద్రీనీవా లైనింగ్ అంశాన్ని సీఎం చంద్రబాబు వద్దకు తీసుకెళ్లే సన్నాహాలు చేస్తున్నారు. కాలువకు లైనింగ్ నిర్మిస్తే నీటి వృథాను అరికట్టి చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందించవచ్చని హంద్రీనీవా ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు. ఈ అంశంపై ఎదురవుతున్న సమస్యలపై ఓసారి చర్చించి, వైసీపీ విష ప్రచారానికి తెర వేయాలని హంద్రీనీవా ప్రధాన కాలువ వెళ్లే నియోజకవర్గాల ఎమ్మెల్యేలు సిద్ధమవుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఆరు లక్షల ఎకరాల సాగు లక్ష్యం

హంద్రీనీవాతో ఉమ్మడి జిల్లాలో ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రధాన కాలువ విస్తరణ, లైనింగ్ చేపట్టి నీటి వృధాను నియంత్రించి రిజర్వాయర్లతోపాటు చెరువులను నింపాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. కేటాయించిన నిధులతో వంద రోజుల్లో లైనింగ్ పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో అధికారులు పనులు మొదలు పెట్టారు. లైనింగ్‌తో సాగు, తాగు నీటి సమస్యలు తీరేలా ప్రణాళికలు చేపట్టారు. ఇప్పటికే జీడిపల్లి రిజర్వాయర్ నుంచి ప్రధాన కాలువతోపాటు పుంగనూరు ఉపకాలువ లైనింగ్ పనులు మొదలు పెట్టారు. ఈ పనులు పూర్తయితే నీటి వృథా పూర్తిగా తగ్గిపోతుందని హంద్రీనీవా అధికారులు చెబుతున్నారు.

రైతులు, నాయకుల్లో లైనింగ్ టెన్షన్

జీడిపల్లి నుంచి రెండో దశ హంద్రీనీవా కాలువ ఉరవకొండ నియోజకవర్గంలో మొదలై రాప్తాడు, పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల మీదుగా సాగుతుంది. ఈకాలువకు ఇరువైపులా రైతులు బోర్లు వేసుకుని పంటలు పండిస్తున్నారు. కిలోమీటర్ల దూరంలోని రైతులు సైతం హంద్రీనీవా కాలువ ద్వారా వచ్చిన నీటితో నిండిన చెరువుల్లోకి పైపు లైన్లు వేసుకుని భూములను సాగు చేసుకుంటున్నారు. ప్రధానంగా రాప్తాడు, పుట్టపర్తి నియోజకవర్గాల్లో కాలువ ఉండగా కదిరి నియోజకవర్గంలో ప్రధాన కాలువతోపాటు పుంగనూరు, కుప్పం ఉపకాలువ ఉంది. లైనింగ్ ఏర్పాటుతో కాలువ ఇరువైపులా భూగర్భ జలమట్టం అడుగంటుతుందని ఇటీవల ఆయా నియోజక వర్గాల్లో వైసీపీ నాయకులు రైతుల్లో అపోహలు కలిగిస్తున్నారు. ఈనేపథ్యంలో హంద్రీనావా కాలువ ద్వారా వచ్చిన నీటితో పంటలు పండించుకుంటున్న రైతుల్లో అలజడి మొదలైంది. లైనింగ్‌తో భూగర్భ జలాలు అడుగంటుతాయని ఆయా నియోజకవర్గాల్లో అధికార పార్టీ ఎమ్మెల్యేల వద్ద రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ మనుగడ కోసం లైనింగ్‌పై అపోహలు కలిగిస్తోన్న వైసీపీని ఎలా ఎదుర్కోవాలని రాప్తాడు, పుట్టపర్తి ఎమ్మెల్యేలు మల్లగుల్లాలు పడుతున్నారు. దేశంలో దాదాపు అన్ని రాష్ట్రాల్లో సాగునీటి కాలువలకు లైనింగ్ ఏర్పాటు చేసి, నీటి పొదుపు చర్యలు పాటిస్తుంటే ఉమ్మడి జిల్లాలో మాత్రం హంద్రీనీవా కాలువకు లైనింగ్ ఏర్పాటుపై అపోహలు కలుగుతున్నాయి.

మామిడి రైతుల కోసం..

50 శాతం సబ్సిడీతో రక్షణ కవచం



మామిడి ఫ్రూట్‌కేర్ కవర్

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మామిడి రైతులకు 50 శాతం సబ్సిడీతో ఫ్రూట్ కేర్ కవర్ పంపిణీ చేస్తామని ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహారావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది జిల్లాలో 1000 హెక్టార్లలకు అవసరమైన మామిడి రక్షణ కవచం పంపిణీ చేయాలని లక్ష్యం విధించారన్నారు. ఒక్కో రైతుకు హెక్టారుకు 20వేల రక్షణ కవచం కవర్లు ఇస్తామన్నారు. ఒక్కో కవర్ పూర్తి ధర రూ.2లు కాగా సబ్సిడీతో రూ.1కి అందజేస్తామని తెలిపారు. ఈ ఫ్రూట్ కవర్‌ను మామిడి పిందే దశలో (నిమ్మకాయ, కోడి గుడ్డు పరిమాణంలో) ఉన్నప్పుడు కట్టాలన్నారు. ఈ ఫ్రూట్ కవర్ వాడటం ద్వారా ఊజీ ఈగ, మచ్చలు, తేనె మంచు పురుగు, తామర పురుగు తదితర తెగుళ్లను నివారించడంతోపాటు నాణ్యమైన పండ్ల దిగుబడి వస్తుందన్నారు. క్రిమి కీటకాలు పండ్లను నాశనం చేయకుండా, అధిక సూర్యరశ్మి నుంచి కూడా రక్షణ కల్పించవచ్చని వెల్లడించారు. ఫ్రూట్ కవర్‌ను వినియోగించడం ద్వారా పురుగుమందులు వాడాల్సిన అవసరం ఉండదన్నారు. కాయకుండే సహజ మంచి లక్షణాలను పెంచి, తొడిమ దృఢంగా తయారై, కాయ పరిమాణాన్ని పెంచడంతోపాటు కాయ సహజ రంగును పెంచుతుందన్నారు. మామిడి సాగు చేసే రైతులు ఈ పథకానికి అర్హులన్నారు. ఫ్రూట్ కవర్ కావాల్సిన రైతులు స్థానిక ఉద్యాన కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

చీనీలో సస్య రక్షణ ఇలా..



చీనీ తోటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి

రాప్తాడు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): చీనీ పంటకు తెగుళ్లు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యాన శాఖ అధికారి రత్నకుమార్ తెలిపారు. మండలంలోని హంపాపురం గ్రామంలో మంగళవారం రైతులతో కలిసి చీనీ తోటను పరిశీలించి, తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉద్యానశాఖ అధికారి మాట్లాడుతూ రాత్రి వేళ చలి, మంచు ఎక్కువగా ఉండటం, పగటి పూట ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండటం వలన పడమర దిశలో ఉన్న చీనీ కాయలు ఎండ పొడకు గురవుతున్నాయన్నారు. ఎండ పొడ నివారణకు రైతులు సాకీయంగా కొమ్మలు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలన్నారు. యూరియా 10 గ్రాములు ఒక్క లీటరు నీటికి కలిపి స్ప్రే చేసుకోవాలన్నారు. అలాగే వారం తర్వాత లీటరుకు 20 గ్రాములు బట్టి సున్నం కలిపి స్ప్రే చేస్తే కాయలకు ఎండపొడతెగులు రాకుండా కాపాడుకోవచ్చన్నారు. రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రూరల్, గార్లదిన్నె మండలంలో రైతు సేవా కేంద్రం ద్వారా ఉద్యాన రైతులకు సేవలు అందిస్తున్నట్లు వివరించారు.

యూట్యూబర్ మృతదేహం లభ్యం

- హత్య అని అనుమానం
- పోలీసుల అదుపులో అనుమానితుడు



రోదిస్తున్న తిరుమలరెడ్డి భార్య, కుమార్తె, కుటుంబ సభ్యులు

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం ఉదయం అదృశ్యమైన యూట్యూబర్ బోగాల తిరుమల రెడ్డి(42) మంగళవారం విగతజీవిగా కనిపించాడు. మండలంలోని బుగ్గ సంగాల వద్ద ఉన్న తన తోటకు తిరుమలరెడ్డి సోమవారం ఉదయం ద్విచక్రవాహనంపై వెళ్లాడు. అయితే మార్గమధ్యంలో హంద్రీనీవా కాలువ పక్కన తిరుమల రెడ్డి ద్విచక్ర వాహనం ధ్వంసమై కనిపించింది. బైక్‌కు సమీపంలోనే తిరుమల రెడ్డికి చెందిన చెప్పులు, సెల్‌ఫోన్, డబ్బులు కనిపించాయి. తిరుమల రెడ్డి కుటుంబ సభ్యుల ఫిర్యాదుపై మిస్సింగ్ కేసును నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. గజ ఈతగాళ్లతో తిరుమలరెడ్డి ఆచూకీ కోసం హంద్రీనీవా కాలువలో వెతికించారు. మంగళవారం ఉదయం హంద్రీనీవా కాలువలో తిరుమల రెడ్డి మృతదేహం తేలియాడుతూ కనిపించింది. ఘటనా స్థలానికి రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్, కసాపురం ఎస్ఐ వెంకటస్వామి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీయించారు. తిరుమల రెడ్డి మృతదేహాన్ని పరిశీలించగా కుడి కన్ను కందిపోయి, కుడి కాలు విరిగిపోయి కనిపించాయి. పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వద్దకు తిరుమల రెడ్డి కుటుంబ సభ్యులు పెద్దఎత్తున చేరుకున్నారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా సంఘంలో పనిచేస్తూ ఆక్రమాల మీద ప్రశ్నిస్తే చంపేస్తారా అంటూ తిరుమల రెడ్డి కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుడి భార్య కామేశ్వరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

పోలీసుల అదుపులో అనుమానితుడు


తిరుమలరెడ్డి మృతిని హత్యగా భావించి, అనుమానంతో సంగాల గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని పోలీసులు సోమవారమే అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అతడిని పోలీసులు విచారించగా తిరుమల రెడ్డిని హత్య చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిసింది. తన భర్త బుగ్గ సంగాలకు చెందిన కుమార్‌తో ఘర్షణపడ్డాడని మృతుడి భార్య సోమవారం అనుమానం వ్యక్తంచేసిన సంగతి తెలిసిందే. బుగ్గసంగమేశ్వర దేవాలయం సమీపంలో నిందితుడి పొలం ఉంది. పొలం పక్కనే ప్రభుత్వ పోరంబోకు స్థలం ఉంది. ఈ స్థలంలో నిందితుడు మట్టి వేసి చదును చేశాడు. ఈ విషయంపై తిరుమల రెడ్డి అతడితో గతంలో గొడవ పడినట్లు తెలిసింది. ఈ విషయంగా తిరుమల రెడ్డి కలెక్టరు, తహసీల్దారుకు ఫిర్యాదు చేశాడు. కోర్టులో కేసు వేస్తానని తిరుమలరెడ్డి తనను బెదిరించినట్లు నిందితుడు పోలీసుల విచారణలో చెప్పినట్లు సమాచారం. దీంతో పథకం ప్రకారం తిరుమల రెడ్డిపై దాడి చేసి, హత్య చేసినట్లు పోలీసు విచారణలో ఒప్పుకున్నట్లు తెలిసింది. వివరాలను పోలీసులు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

బోగస్ పట్టాలకు రుణాలు
మార్ట్‌గేజ్‌లో ఉన్న భూములూ విక్రయం
వెలుగు చూస్తున్న అక్రమాలు



జంతలూరు గ్రామంలోనే అధికంగా మార్ట్‌గేజ్‌లో ఉన్న భూములను విక్రయించినట్లు చెబుతున్నారు.. ఏడీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయం

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘా(పీఏసీఎస్)లను అవినీతి, అక్రమాలకు అడ్డాలుగా మార్చారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బోగస్ పట్టాలకు రుణాలిచ్చారు. మార్ట్‌గేజ్‌లో ఉన్న భూములను సైతం విక్రయించారు. తాజాగా నిర్వహించిన ఏడీసీసీ బ్యాంకు బోర్డు సమావేశంలో బుక్కరాయసముద్రం సొసైటీ పరిధిలోని మార్ట్‌గేజ్ చేసిన భూములపై మరో బ్యాంకులో రుణాలు పొందడం, ఇదే భూములను ఓ రిటైర్డ్ అటవీ అధికారికి విక్రయించిన విషయం చర్చకు రావడం కలకలం రేపుతోంది. సొసైటీల్లో రుణాలు పొంది తాకట్టు పెట్టిన ఒరిజినల్ పట్టాలు బయటకు ఎలా వెళ్లాయన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. బోగస్ పట్టాలు తాకట్టు పెట్టి రుణాలు పొందారా అనే సందేహాలు వినిపిస్తున్నాయి. ఇదంతా ఇంటి దొంగల పనేనంటూ సొసైటీ ఉద్యోగులపై సహకార శాఖ అధికారులు సమావేశంలో అనుమానాలు వ్యక్తం చేయడం గమనార్హం. ఇదే అంశంపై ఏడీసీసీ బ్యాంకు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు కూడా అందాయి. ఆత్మకూరు సొసైటీ పరిధిలో పది మందికి బోగస్ పట్టాలపై రుణాలిచ్చిన వ్యవహారంలో బాధ్యుడైన అధికారిని కాపాడేందుకు తూతూమంత్రంగా విచారణ చేసి, తనకు ఉద్యోగులు సహకరించడం లేదంటూ నివేదిక ఇవ్వడం విమర్శలకు తావిస్తోంది.



- ఆంధ్రజ్యోతి, అనంతపురం క్లాక్‌టవర్

సొసైటీల్లో ఇష్టారాజ్యం..!

28 శాఖలు.. 108 సొసైటీలు

ఉమ్మడి జిల్లాలో 28 ఏడీసీసీ బ్యాంకు శాఖలున్నాయి. వీటి పరిధిలో 108 సొసైటీలున్నాయి. వాటిలో ఇప్పటి వరకు 37,512 మందికిగాను చెల్లించిన రుణాల్లో రూ.188 కోట్లు ఎన్‌పీఏ కిందికి వెళ్లాయి. వీటిలో భూములు లేకుండానే బోగస్ పట్టాలపై ఇచ్చిన రుణాలే ఎన్‌పీఏగా మారాయని తెలుస్తోంది. ఎన్‌పీఏల వసూలుకు వ్యక్తిగతంగా, యూనియన్ల పరంగా వెళ్లకూడదనేది బ్యాంకింగ్ వ్యవస్థలోని నిబంధన. ఇందుకు విరుద్ధంగా ఏడీసీసీ బ్యాంకులో ఓ యూనియన్ తరఫున ఎన్‌పీఏల రికవరీకి వెళ్లడం విమర్శలకు తావిస్తోంది. ఏడీసీసీ బ్యాంకు అధికారులు ఓ యూనియన్‌కు వత్తాసు పలుకుతూ ఈ తంతు సాగిస్తున్నారనే చర్చ వినిపిస్తోంది. రుణాల వసూళ్లలో అటు బ్యాంకు అధికారులు, ఇటు సొసైటీ ఉద్యోగులు ఏమాత్రం శ్రద్ధ పెట్టడం లేదనీ, కనీస బాధ్యత తీసుకోవట్లేదని ఇటీవల నిర్వహించిన బోర్డు సమావేశంలో ఉన్నతాధికారులు అసహనం వ్యక్తం చేయడం గమనార్హం.

పట్టాలు బయటకు ఎలా వెళ్లాయి?

బ్యాంకు, సొసైటీల్లో రుణాలు పొందిన భూపట్టాలు అక్కడే మార్ట్‌గేజ్ చేసి, ఒరిజినల్ పట్టాలు తాకట్టు పెట్టాల్సి ఉంటుంది. సొసైటీల్లో తీసుకున్న తరువాత మరో బ్యాంకులో అదే పట్టాపై రుణం పొందడం అనుమానాలకు తావిస్తోంది. బోగస్ పట్టాలు సృష్టించి ఉండాలన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇందులో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల అధికారుల పాత్రపై విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎంచక్కా.. విక్రయించారు..

బుక్కరాయసముద్రం సొసైటీలోనే మార్ట్‌గేజ్ చేసిన భూములను అధికంగా విక్రయించారు. సొసైటీలో రుణం పొందిన ఓ వ్యక్తి ఆ భూములపైనే తిరిగి మరో బ్యాంకులో లోన్ తీసుకున్నాడు. అక్కడితో ఆగకుండా అదే భూమిని ఓ రిటైర్డ్ అటవీ అధికారికి విక్రయించినట్లు సమాచారం. ఇదే విషయాన్ని ఇటీవల నిర్వహించిన ఏడీసీసీ బ్యాంకు బోర్డు సమావేశంలో అధికారులు లేవనెత్తారు. బుక్కరాయసముద్రం మండలం జంతులూరు గ్రామంలో ఇలా భూములను విక్రయించి, ఇతర బ్యాంకుల్లోనూ రుణాలు పొందారని స్వయంగా ఏడీసీసీ బ్యాంకు అధికారులే పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది.

బుక్కరాయసముద్రం సొసైటీ కార్యాలయం





నిబంధనలకు విరుద్ధంగా యూనియన్ తరఫున రుణాల రికవరీ చేస్తున్న ఉద్యోగులు

అవినీతి, అక్రమాలకు అడ్డాలు

సొసైటీల్లో అనేక అక్రమాలు బయటపడుతున్నాయి. సొసైటీల్లో ఉద్యోగులు ఏళ్లుగా ఒకేచోట పనిచేస్తుండడం కూడా ఇందుకు కారణమని తెలుస్తోంది. ఆత్మకూరు సొసైటీలో సుమారు 10 మందికి బోగస్ పట్టాలపై రుణాలు మంజూరు చేసిన విషయం తెలిసిందే. దీనిపై విచారణకు ఆదేశించారు. తూతూమంత్రంగా విచారణ చేసిన ఏడీసీసీ బ్యాంకు డీజీఎం రాంప్రసాద్, బ్యాంకు, సొసైటీ ఉద్యోగులు విచారణకు సహకరించలేదంటూ నివేదిక ఇవ్వడం గమనార్హం. బోగస్ పట్టాలకు రుణాలు చెల్లించడంలో కీలకంగా ఉన్న ఓ అధికారిని రక్షించేందుకే ఇలా.. నివేదిక ఇచ్చారని పలువురు ఆ శాఖలోని అధికారులే చర్చించుకుంటుండడం గమనార్హం.


ఇటీవల నిర్వహించిన బోర్డు సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ

మార్ట్‌గేజ్ భూములను విక్రయించరాదు

మార్ట్‌గేజ్‌లో ఉన్న భూములను విక్రయించరాదు. ఇతర బ్యాంకుల్లో కూడా రుణాలు పొందరాదు. బుక్కరాయసముద్రం సొసైటీ పరిధిలో మార్ట్‌గేజ్‌లో ఉన్న భూములను ప్రభుత్వ అధికారులు కొనుగోలు చేసినట్లు మా దృష్టికి వచ్చింది. ఇలాంటివి 25కిపైగా ఉన్నట్లు గుర్తించాం. వీటిపై విచారించి, బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

- శివనారాయణ శర్మ, జాయింట్ కలెక్టర్, ఏడీసీసీ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి

హత్యా..? ఆత్మహత్యా..?

ఇంటర్ విద్యార్థి అనుమానాస్పద మృతి

- ఉరికి వేలాడిన ఎస్ఆర్ కాలేజీ విద్యార్థి
- తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వని యాజమాన్యం
- మృతదేహంతో ఆందోళనకు దిగినా.. స్పందన కరువు
- పోలీసుల హామీతో శాంతించిన కుటుంబ సభ్యులు




ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు, విద్యార్థి సంఘాలు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): 'నోరు సచ్చినోడు. ఎవర్నీ ఏమనేటోడు కాదు. మంచి పిల్లోడు. ఆదివారం రాత్రి కాటమయ్య కొండకు పొయ్యొచ్చినాడు. ఏమైందో.. ఏమో..! మీ పిల్లోడు సచ్చిపొయినాడని కాలేజీ పిల్లోళ్లు చెప్పినారు. అన్యాయంగా నా కొడుకును సంపినారు. మీ కొడుగు చస్తే మీకు తెలుస్తాది బాధ..' చేతికొచ్చిన బిడ్డ చెట్టుకు నిర్జీవంగా వేలాడటంతో.. ఆ కన్నతల్లి గుండె పగిలేలా ఏడ్చింది. శాపనార్థాలు పెట్టింది. ధర్మవరం మండలం మల్కాపురం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి శ్రీకాంత్(19) అనుమానాస్పద మృతితో అనంతపురం రూరల్ మండలంలోని ఎస్ఆర్ జూనియర్ కాలేజీ వద్ద మంగళవారం ఉద్రిక్తత ఏర్పడింది. తల్లిదండ్రులు, బంధువులు, విద్యార్థి సంఘాల నాయకులు శ్రీకాంత్ మృతదేహంతో కాలేజీ ప్రధాన ద్వారం వద్ద బైఠాయించారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ అరుపులు, ఆర్తనాదాలు, నినాదాలు మిన్నంటాయి. కాలేజీ యాజమాన్యం వైపు నుంచి ఎవరూ స్పందించకపోవడంతో గేటును తోసుకుని లోపలికి వెళ్లేందుకు యత్నించారు.

అనుమానాస్పదం..

మల్కాపురం గ్రామానికి చెందిన మిడతల శ్రీకాంత్ అనంతపురం రూరల్ పరిధిలోని ఆలమూరు రోడ్డులో ఉన్న ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ చదువుతున్నాడు. అక్కులప్ప, నారాయణమ్మ దంపతులకు ముగ్గురు సంతానం కాగా, పెద్దకొడుకు మూర్తి, కూతురు ముత్యాలమ్మ, చివరివాడు శ్రీకాంత్. విశ్వసనీయ సమాచారం మేరకు, శ్రీకాంత్ తన స్నేహితుడు మహేంద్రతో కలసి దేవున్ని చూడ్డానికి మూష్టూరు వద్ద ఉన్న కాటమయ్య కొండకు ఆదివారం వెళ్లి వచ్చారు. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకూ క్లాసులు, స్టడీ అవర్స్‌లో ఉన్నాడు. రాత్రి 10 నుంచి 10.30 గంటల వరకూ మిత్రులకు కనిపించాడు. మంగళవారం ఉదయం 6.30 గంటలకు కాలేజీ హాల్ భవంతి నుంచి సుమారు 150 అడుగుల దూరంలో ఉన్న ఓ దానిమ్మ తోటలో ఎండిన చెట్టుకు డ్రిప్ పైప్‌తో ఉరివేసుకుని కనిపించాడు. విద్యార్థి మృతదేహం నేలకు తాకడం, చొక్కాపై రక్తపు మరకలు, డొక్కపైన చిన్న గాయం, కళాశాల సిబ్బంది నుంచి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకపోవడం.. ఇవన్నీ అనుమానాలకు తావిస్తున్నాయి.

కనిపించని యాజమాన్యం

శ్రీకాంత్ మృతి సమాచారం తెలియగానే తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కన్నీరుమున్నీరవుతూ కాలేజీ వద్దకు వచ్చారు. కడుపు మంటతో అక్కడున్న సిబ్బందిని తిట్టారు. జోనల్ ఇన్‌చార్జ్, ప్రిన్సిపాల్ బయటకు రావాలని కేకలు వేశారు. పరీక్షలు జరుగుతున్నాయంటూ పోలీసులు వారిని బలవంతంగా బయటకు పంపారు. ఇంత ఘోరం జరిగినా ఎవరూ స్పందించకపోవడంతో బాధితులు మృతదేహాన్ని స్ట్రెచ్చర్ తీసుకొచ్చి రోడ్డుపై బైఠాయించారు. మండుటెండలో ఏడ్చి, ఏడ్చి తండ్రికి నోట మాట రాలేదు. తల్లి, అన్న, చెల్లి సొమ్మసిల్లేలా ఏడుస్తూ కనిపించారు. బంధువులు కన్నీళ్లు పెట్టుకున్నారు. రెండున్నర గంటలపాటు మృతదేహంతో బైఠాయించినా యాజమాన్యం వైపు నుంచి స్పందన రాలేదు. దీంతో కళాశాల గేట్లు తోసుకుని లోపలికి వెళ్లేందుకు యత్నించారు. అడ్డుకున్న పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఆ తరువాత కొందరిని పోలీసుల ఆధ్వర్యంలో కళాశాలలోకి అనుమతించారు. జోనల్ ఇన్‌చార్జ్, ప్రిన్సిపల్‌పై కేసులు పెట్టాలని, అరెస్టు చేయాలని బయట ఉన్నవారు నినాదాలు చేశారు. చర్చల తరువాత, న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతదేహాన్ని పెద్దాసుపత్రికి తరలించారు. కాలేజీకిలో వెళ్లొచ్చిన తరువాత ఆర్ఐఓ వెంకటరమణ మీడియాతో మాట్లాడారు. విద్యార్థులతో స్వయంగా మాట్లాడానని, విచారణ నివేదిక రాగానే కాలేజీపై చర్యలు తీసుకుంటామని చెప్పి వెళ్లిపోయారు.


ఉరికి వేలాడుతున్న శ్రీకాంత్

భయపడ్డాడా.. భయపెట్టారా..?

విద్యార్థి మరణానికి కారణాలు తెలియడం లేదు. భయపడ్డాడా.. లేక భయపెట్టారా అనే చర్చ జరుగుతోంది. అధికారులు తెలిపిన మేరకు.. రూ.60 వేల ఫీజులో ఇప్పటికే రూ.20 వేలు చెల్లించారు. రూ.40 వేలు పెండింగ్ ఉంది. కళాశాల నుంచి ఫీజుల ఒత్తిడిపై స్పష్టత రావడం లేదు. రాత్రి స్టడీ అవర్స్ 10.30 గంటలకు ముగిసినా.. శ్రీకాంత్ తరచూ 11 గంటల వరకూ చదువుకునేవాడని సహ విద్యార్థులు అంటున్నారు. చదువుల ఒత్తిడితో ఆత్మహత్య చేసుకున్నాడా..? లేక కళాశాల యాజమాన్యం ఫీజు కోసం ఒత్తిడి చేసిందా..? అన్న స్పష్టత లేదు. పోస్టుమార్టం నివేదిక వస్తే హత్యా..? ఆత్మహత్యా..? అనేది తేలుతుంది.

యువకుడి ఆత్మహత్య


ఈశ్వర్ (ఫైల్)

కణేకల్లు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని 43 ఉడేగోళం గ్రామానికి చెందిన బోయ ఈశ్వర్(25) మంగళవారం రాత్రి ఆత్మహత్యకు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడు గ్రామంలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తు జీవించేవాడు. ఏమి జరిగిందో కానీ మంగళవారం సాయంత్రం తన ఇంట్లో ఉరి వేసుకున్నాడు. బంధువులు గమనించి కణేకల్లు క్రాసింగ్‌లోని ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు ఈశ్వర్‌కు భార్య కావేరితో పాటు ఒక కుమారుడు ఉన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఐటీఐ విద్యార్థులకు జాబ్‌మేళా

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఐటీఐ పాసైన విద్యార్థులకు ఈనెల 21 జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీఐ కళాశాలల జిల్లా కన్వీనర్ రామమూర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. హిందూపురం, దొడ్డబళ్లాపూర్, బెంగళూరుకు చెందిన వివిధ ప్రముఖ కంపెనీలు ఈమేళాలో పాల్గొంటాయన్నారు. నగరంలోని శ్రీసాయి వెంకటేశ్వర ఐటీఐ కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూలకు విద్యార్థులు వారి సర్టిఫికెట్లు, పాస్‌ఫొటోలతో హాజరు కావాలన్నారు.

మాట నిలబెట్టుకోండి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

పేదలకు ఇంటి పట్టాల కోసం నిరసన


మాట్లాడుతున్న రామకృష్ణ


ధర్నాకు హాజరైన పేదలు

తాడిపత్రి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పేదలకు పట్టాలు ఇచ్చి ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్ ఆధ్వర్యంలో ఇంటి పట్టాల కోసం మంగళవారం నిర్వహించిన నిరసనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పేదలకు పట్టణంలో 2సెంట్లు, గ్రామాల్లో 3సెంట్లు ఇస్తామని ప్రకటించిందన్నారు. ఆ వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. పేదలకు రూ.5లక్షల వ్యయంతో పక్కా ఇంటి నిర్మాణం చేస్తామని కూడా ఎన్నికల సందర్భంగా చెప్పారని, అధికారం చేపట్టి దాదాపు 10నెలలైనా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పేదలకు ఇళ్లు, స్థలాలపై ఇప్పటికే రెవెన్యూ మంత్రి, మున్సిపల్ మంత్రి, సీఎం చంద్రబాబుతో కూడా చర్చించినట్లు వెల్లడించారు. వారంతా సానుకూలంగా స్పందించారు కనుక శాంతియుతంగా పట్టాల కోసం నిరసన కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. గత టీడీపీ పాలనలోనే 80 శాతం నిర్మాణం పూర్తి చేసిన టిడ్కో ఇళ్లను వినియోగంలోకి తేవాలన్నారు. 24వతేదీ నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో పేదల ఇళ్లు, స్థలాల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. జగన్ పాలనలో పేదలకు 31లక్షల ఇళ్లకు పట్టాలు ఇచ్చాం అని చెప్పడం తప్ప చేసిందేమి లేదని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగదీష్ మాట్లాడుతూ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డితో మాట్లాడానని ఇళ్లులేని నిరుపేదలకు ఇంటి స్థలాలకు పట్టాలు ఇవ్వాలని అయనతో చర్చించినట్లు పేర్కొన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా 33లక్షల మందికి ఇంటిస్థలాల కాగితాలు మాత్రమే పంపిణీ చేశారు. పట్టణాల్లో సెంటు, గ్రామాల్లో సెంటున్నర చొప్పున ఇచ్చారు. ఇంటినిర్మాణానికి రూ.1.8లక్షలు మాత్రమే ఇచ్చి నిర్మాణాలను పడక ఎక్కించారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాజారెడ్డి, రంగయ్య, వెంకటరాముడుయాదవ్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన రిటైర్డ్ పోలీస్ అధికారుల సంఘం ప్రతినిధులు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తెలుగు రాష్ట్రాల రిటైర్డ్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు మహబూబ్ సాహెబ్ ఆధ్వర్యంలో జిల్లా రిటైర్డ్ పోలీస్ అధికారుల సంఘం ప్రతినిధులు జిల్లా ఎస్పీ జగదీష్‌ను మంగళవారం కలిశారు. 1961 నుంచి 1975వరకు రిక్రూట్ అయిన పోలీస్ సిబ్బంది ప్రొబేషన్ కాలానికి సంబంధించి యాన్యువల్ ఇంక్రిమెంట్, వెయిటేజ్ ఇంక్రిమెంట్ సమస్యలకు పరిష్కారం చూపాలని కోరు తూ వినతిపత్రం అందజేశారు. పరిశీలించి పరిష్కారం చూపుతానని ఎస్పీ వారికి హామీ ఇచ్చారు.

నేడు జిల్లాకు రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ రాక

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ పి. విజయ్‌కుమార్ బుధవారం జిల్లాకు రానున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జ్ ఈడీ రాధిక తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. మాల కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో జిల్లాల వారీగా పర్యటనలో భాగంగా అనంత జిల్లాకు రానున్నట్లు తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు ఎస్సీ సంఘాల నాయకులతో సమావేశమవుతారన్నారు. 11 గంటలకు కార్యాలయ ఉద్యోగులతో వివిధ రకాల సంక్షేమ పథకాలపై సమీక్షిస్తారన్నారు. 12.00 గంటలకు విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 12.30గంటల నుంచి 1.30 గంటల వరకూ ఎస్సీ కార్పొరేషన్ పరిధిలోని టవర్ క్లాక్, కలెక్టరేట్ వద్దనున్న ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్‌లు, టీవీ టవర్ వద్దనున్న ఇండస్ట్రీయల్ కాంప్లెక్స్‌లను పరిశీలిస్తారన్నారు. అనంతరం కడపకు బయలుదేరి వెళ్తారన్నారు.

పథకాల అమలులో బ్యాంకర్లదే కీలక పాత్ర

కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్


విరివిగా పంట రుణాలు ఇవ్వాలి: ఎంపీ అంబికా


బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అంబికా

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అర్హులకు దరి చేర్చడం, అమలులో బ్యాంకర్ల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక జడ్పీలోని డీపీఆర్‌సీ భవనంలో బ్యాంకర్ల మూడు నెలల పురోగతిపై సమీక్షా సమావేశం, సంప్రదింపుల కమిటీ జిల్లా స్థాయి సమావేశం మంగళవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన అమలు, రుణాల చెల్లింపులు నూరు శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. లక్ష్యసాధనలో బ్యాంకర్లు నిర్లక్ష్యం వహించరాదని, జిల్లా అభివృద్ధికి బ్యాంకర్ల పాత్ర కీలకమన్నారు. జిల్లాలో 34బ్యాంకులకు సంబంధించి 290బ్రాంచ్‌లు ఉన్నాయన్నారు. గుర్తించిన 51గ్రామాల్లో ఆర్‌ఓ ప్లాంట్ల కోసం బ్యాంకులకు ప్రత్యేకంగా లేఖలు రాసి ఏర్పాటు చేసేలా ఎల్‌డీఎం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్థిక అక్షరాస్యత, స్వయం ఉపాధిలో శిక్షణలో పాల్గొంటున్నవారికి శిక్షణ పూర్తయ్యాక సర్టిఫికెట్లు అందజేయాలన్నారు. స్టాండప్ ఇండియా పథకం కింద ఈ ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు నాటికి 39.34శాతం మాత్రమే రుణాలు ఇచ్చారని, కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా అర్హులైన లబ్ధిదారులకు ఆయా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కింద రుణాలను మంజూరు చేయాలని సూచించారు. విద్యారుణాలకు సంబంధించి యూకో బ్యాంకు 109మందికి గాను కేవలం ముగ్గురికి మాత్రమే అందజేశారని, స్పెషల్‌డ్రైవ్ ద్వారా అర్హులైన విద్యార్థులందరికీ విద్యారుణాలు అందజేసేలా చూడాలని ఆదేశించారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జిల్లాలోని రైతుల శ్రేయస్సు కోసం బ్యాంకులు మానవ తాదృక్పథంతో పనిచేయాలని, విరివిగా పంట రుణాలు అందజేసి తోడ్పాటు అందించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య, ఎల్‌డీఎం నర్సింగారావు, వ్యవసాయ శాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, జిల్లా ఉద్యానశాఖ అధికారి నరసింహారావు, జిల్లా పరిశ్రమలశాఖ జెడ్‌ఎం శ్రీధర్, మత్స్యశాఖ డీడీ శ్రీనివాసనాయక్, మెప్మా పీడీ విశ్వజ్యోతి, చేనేత జౌళి శాఖ ఏడీ శ్రీనివాసరెడ్డి, జిల్లా బ్యాంకుల అధికారులు, సీనియర్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

రాములోరి సేవలో ముస్లిం


ప్రతిష్ఠించడానికి ప్రత్యేక పూజలు చేసిన రాములోరి విగ్రహాలు


ఎస్కె మస్తాన్‌వలి

తనకల్లు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో చేపట్టే ఏ అభివృద్ధి కార్యక్రమానికైనా తనవంతు సాయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. కొర్తికోట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు ఎస్కే మస్తాన్‌వలి. ఆలయ నిర్మాణమైనా, అమ్మవారి ఊరేగింపు అయినా, సామూహిక సీమం తాలు, పేదల వివాహాలు ఇలా ఏ కార్యక్రమమైనా కులమతాలు, పార్టీలకు అతీ తంగా చేయూత అందిస్తున్నారు. ముఖ్యంగా గ్రామంలో రామాలయ నిర్మాణానికి తనవంతు సహకారం అందించడమేకాకుండా రాములవారి విగ్రహ ప్రతిష్ఠ కోసం వేద పండితులను తీసుకొచ్చారు. మూడురోజులుగా గ్రామంలో కొనసాగుతున్న అన్నదాన కార్యక్రమాన్ని తానే ముందుండి నిర్వహిస్తున్నారు. ముస్లిం మతానికి చెందిన వారైనా హిందూ దేవుళ్ల సేవలో సాగుతున్న మస్తాన్‌వలిని పలువురు ప్రశంసిస్తున్నారు.

ఐజీ ఆఫీస్‌కు ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్లు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పరిధిలో పనిచేస్తున్న ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్లను స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ కార్యాలయానికి బదిలీ చేశారు. రాయదుర్గం సబ్‌రిజిస్ట్రార్ శ్రీనివాసులు, పెనుకొండ సబ్‌రిజిస్ట్రార్ వెంకటనాయుడును డెప్యుటేషన్‌పై ఆరు నెలల పాటు ఐజీ కార్యాలయంలో విధులు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేశారు. ఉరవకొండ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసే సీనియర్ అసిస్టెంట్ జయదీప్, అనంతపురం రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసే జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డిలను ఐజీ కార్యాలయానికి వెళ్లేలా ఆదేశాలందాయి. రాయదుర్గం ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్‌గా అనంతపురం జాయింట్-2సబ్‌రిజిస్ట్రార్ యూనస్‌ను, పెనుకొండలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న సురేష్ ఆచారికి అక్కడే ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

ఇన్‌ఫ్లో 823 క్యూసెక్కులు

బెళుగుప్ప, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 823 క్యూసెక్కులు ఉన్నట్లు మంగళవారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 631 క్యూసెక్కులు వెళుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.681 టీఎంసీలు నీటి నిల్వ వుందని అధికారులు వెల్లడించారు.

న్యూస్ బాక్స్

రేపటి నుంచి రుణాలకు ఇంటర్వ్యూలు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ కార్పొరేషన్‌ల ద్వారా సబ్సిడీ రుణాల మంజూరు కోసం గురు, శుక్రవారాల్లో రెండు రోజుల పాటు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటస్వామి తెలిపారు. ఆ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయా రోజుల్లో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభం అవుతాయన్నారు. ఆయా బ్యాంకుల పరిధిలోని దరఖాస్తుదారులు వారికి కేటాయించిన తేదీల్లో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.

నేడు ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): శింగనమల మండలం పెద్ద జలాలపురం ఆర్‌డీటీ పాఠశాలలో బుధవారం ఎంఎస్‌ఎంఈ యూనిట్లకు సంబంధించి ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు పరిశ్రమల శాఖ జీఎం శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదస్సులోనే ఉద్యమ్ రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు.

ఢిల్లీకి జిల్లా రిజిస్ట్రార్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్ ఢిల్లీకి వెళ్లారు. వారం రోజుల పాటు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు సంబంధించిన శిక్షణా తరగతుల్లో ఆయన పాల్గొంటారు. అనంతరం ఆయన విధుల్లో చేరుతారు. అప్పటి వరకు డీఐజీ విజయలక్ష్మి ఇన్‌చార్జ్ డీఆర్‌గా వ్యవహరిస్తారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి) జిల్లాలోని పురుగులమందుల దుకాణాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం అకస్మిక తనిఖీలు చేపట్టారు. సీఐ సద్గురుడు, ఏఓ వాసుప్రకాష్ ఆధ్వర్యంలో కుందుర్పి మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర పర్టిలైజర్ (పెస్టిసైడ్స్)లో తనిఖీలు చేశారు. పలు లోపాలు గుర్తించినట్లు ఏఓ వాసు ప్రకాష్ తెలిపారు. దీంతో రూ.33791 విలువగల్ల పురుగుల మందులను జప్తు చేసి, స్థానిక వ్యవసాయ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

భూ కబ్జాకు పాల్పడిన మరో ఐదుగురిపై చర్యలు

అనంతపురం క్రైం,ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) : నగర శివారులో భూ కబ్జాకు పాల్పడిన మరో ఐదుగురిపై అనంతపురం త్రీటౌన్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసినట్లు సీఐ శాంతిలాల్ తెలిపారు. నగరంలోని కమలానగర్‌లో నివాసముంటున్న డాక్టర్ కాటం వీరభద్రయ్య, ఆయన భార్య డాక్టర్ బాలాకుమారి సర్వే నెం. 94లో 12.67సెంట్లు, సర్వే నెం. 89/4బీలో 38 సెంట్ల భూమిని 2007, 2009 సంవత్సరాలలో కొను గోలు చేశారు. జనవరి 17వన కొంతమంది వ్యక్తులు ప్రజాసంఘం పేరుతో భూమిలోకి అక్రమంగా ప్రవేశించి, తాత్కాలిక గుడిసెలు నిర్మించారు. వీరభద్రయ్య ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసుస్టేషన్‌లో భూకబ్జా సెక్షన్ల కింద ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పలువురితో గుడిసెలు తాత్కాలికంగా వేయించి, వారి నుంచి డబ్బు వసూలు చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.

కృత్రిమ కాళ్ల కోసం పేర్లు నమోదు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు కృత్రిమ కాళ్ల కోసం పేర్లు నమోదు చేసుకోవాలని ఆ శాఖ ఉమ్మడి జిల్లా ఏడీ వినోద్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. అనంతపురంలోని బుడ్డప్పనగర్‌లోని కార్యాలయానికి వచ్చి, మార్చి 1వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 08554-232380, 8639081464 నంబర్లలో సంప్రదించలని సూచించారు.

24న పీఎం కిసాన్ సొమ్ము విడుదల

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా రైతులకు ఈనెల 24వ తేదీన 19వ విడత పీఎం కిసాన్ సొమ్మును కేంద్రం విడుదల చేయనునట్లు వ్యవసాయ శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. జిల్లాలోని 2.90 లక్షల మందికి రూ.2వేలు చొప్పున రూ.58 కోట్లు విడుదలయ్యే అవకాశం ఉంది.

ఎలక్ట్రానిక్ రీసెర్చ్‌తో ఉద్యోగావకాశాలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): అధునాతన ఎలక్ట్రానిక్ సిస్టం అభివృద్ధిపై రీసర్చ్‌చేసే విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తున్నాయని జేఎన్టీయూ ఈసీఈ విభాగం ప్రొఫెసర్ రమణారెడ్డి విద్యార్థులకు సూచించారు. మంగళవారం అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ-ఉద్భవ్ సదస్సుకు ప్రొఫెసర్ రమణారెడ్డితో పాటు కళాశాల వైస్ చైర్మన్ రమేష్ నాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ రామూర్తి, నైపుణ్య విభాగ సంచాలకులు సురేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైద్యానికి రూ.లక్ష విరాళం

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నిరుపేద కుటుంబానికి చెందిన ఓ యువకుడి కంటి వైద్యం కోసం రూ.లక్ష విరాళం అందజేసి అమ్మ సంస్థ అండగా నిలిచింది. నగరంలోని బుడ్డప్పనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ మల్లేష్, ఝాన్సీల కుమారుడు బబ్లు ఇంటర్ పూర్తి చేశాడు. కుటుంబ పోషణకోసం తనవంతుగా పెయింటింగ్ పనికి వెళ్లేవాడు. అయితే అతడి ఎండోప్తాల్మిటిస్ అనే వ్యాధితో బాధపడుతున్నట్లు తేల్చారు. వెంటనే ఆపరేషన్ చేయకపోతే కంటిచూపును పూర్తిగా కోల్పోయే ప్రమాదముందని వైద్యులు తెలిపారు. అందుకు బెంగళూరులోని ఓ ఆస్పత్రి వైద్యులను సంప్రదించగా ఆపరేషన్ కోసం రూ.1.20లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారు.ఈ నేపథ్యంలో మంగళవారం అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి బబ్లును కలిసి రూ.లక్ష నగదు అందజేశారు.

మామిడి తోటకు నిప్పు

నార్పల, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మండలకేంద్రం సమీపంలోని మామిడితోటలో చెట్లు మంగళవారం కాలిపోయాయి. నార్పలకు చెందిన మజ్జిగ ఆదెప్ప అనే రైతు తన ఐదెకరాల పొలంలో మామిడి చెట్లను సాగు చేశాడు. ఆదెప్ప రోజు లాగానే తోటలో పనులు ముగించుకొని ఇంటికొచ్చాడు. ఇదే అదునగా భావించిన వారు నిప్పు పెట్టడంతో దాదాపు రెండెకరాలకు పైగా ఉన్న మామిడి చెట్లు, డ్రిప్ పైపులైను, పూర్తిగా కాలిపోయాయని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. రూ. 5 లక్షలు నష్టం వాటిల్లిందని తెలిపాడు. ప్రభుత్వం అదుకోవాలని కోరాడు. నార్పల రెవెన్యూ అధికారులు కాలిపోయిన మామిడి చెట్లను పరిశీలించారు. నష్టాన్ని అంచనా వేసి పై అధికారులకు నివేధిక పంపుతామని తెలిపారు.

అగ్నికి ఆహుతైన మొక్కజొన్న పంట

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని న్యామద్దల గ్రామ సమీపంలో ఓ మహిళా రైతుకు చెందిన మొక్కజొన్న పంట మంగళవారం అగ్నికి ఆహుతైంది. గ్రామానికి చెందిన వరలక్ష్మి మూడెకరాలలో మొక్కజొన్న సాగు చేశారు. అయితే తన పొలం సమీపంలోని కొండగుట్టకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో మంటలు వ్యాపించి మొక్కజొన్న పంట మొత్తం కాలి బూడిదైందని మహిళా రైతు వాపోయింది. పంటతో పాటు డ్రిప్, పైపులు కూడా కాలిపోయాయన్నారు. కోతకు వచ్చిన పంట మొత్తం కాలిపోవడంతో దాదాపు రూ. 3 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని రైతు వాపోయింది.

డిజిటల్ వ్యవస్థతో అవినీతి నియంత్రణ

● ఎంపీ అంబికా ● నగరంలో నక్ష ప్రారంభం



మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): భూముల రికార్డుల విషయంలో డిజిటల్ వ్యవస్థ అవినీతి ద్వారా అరికట్టడంతో పాటు మోసాలను నిరోధించవచ్చని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. నగరంలోని గుత్తి రోడ్డులో ఉన్న పసుపుల కన్వెక్షన్ హాల్‌లో మంగళవారం నగర కమిషనర్ బాలస్వామి అధ్యక్షతన నక్ష(నేషనల్ జియో స్పేషియల్ నాలెడ్జ్ బేస్డ్ లాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హాబిటేషన్స్) కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ భూ సర్వేను దశలవారీగా మూడు దశల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రతి దశను పూర్తి చేయగలిగితే ఒక్కో దశలో రూ. 30కోట్లు ఇన్సెంటివ్ కేంద్ర ప్రభుత్వం నుంచి అందనుంది. ఈ కార్యక్రమానికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, అహుడా చైర్మన్ టీసీ వరుణ్, మేయర్ మహమ్మద్ వసీం సలీం, డిప్యూటీ మేయర్ సాహిత్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ... పట్టణ భూ నిర్వహణపై నక్ష ప్రజల నమ్మకాన్ని మెరుగు పరుస్తుందన్నారు. విదేశీ పెట్టుబడులు, ప్రైవేటు రంగ భాగస్వామ్యం, స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల్లో సహాయం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయగలిగితే కేంద్ర ప్రభుత్వం అందించే రూ.90కోట్ల నిధులను సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమిషనర్ బాలస్వామి, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, రెవెన్యూ సిబ్బంది, వార్డు ప్లానింగ్ సెక్రటరీలు, వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు, వార్డు అమినిటీస్ సెక్రటరీలు, వార్డు రెవెన్యూ సెక్రటరీలు పాల్గొన్నారు.

పనులను పెండింగ్‌లో ఉంచకండి : కమిషనర్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో సివిల్ వర్కులను పెండింగ్‌లో ఉంచకుండా నిర్ధిష్ట సమయంలో పూర్తి చేయాలని నగర కమిషనర్ బాలస్వామి ఆదేశించారు. ఆయన మంగళవారం కమిషనర్ తన చాంబర్‌లో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. వేసవి దృష్ట్యా నీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫైళ్ల క్లియరెన్స్‌లో జాప్యం తగదన్నారు. అంతకుముందు ఆయన నగరంలోని రామ్‌నగర్, కోవూరునగర్, రహమత్ నగర్, గుల్జార్‌పేట ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. రహమత్ నగర్ అండర్ పాస్, ఎస్‌ఎస్‌ఎస్ కళాశాల రోడ్డు ఇరువైపులా చెత్తను తొలగించాలని ఆదేశించారు. రామ్‌నగర్ మినీ పార్కు ఎదుట కల్వర్టు నిండి మురుగునీరు రోడ్డుపైకి రావడంపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగేంద్రపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో ఎస్‌ఈ బాస్కర్‌రావు, ఈఈలు రాధాకృష్ణ, షాకీర్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

నందమూరి తారకరత్నకు నివాళులు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): దివంగత సినీ నటుడు నందమూరి తారకరత్న వర్ధంతిని మంగళవారం నగరంలోని టీడీపీ అర్బన్ కార్యాలయంలో నిర్వహించారు. టీడీపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు గంగారామ్, సరిపూటి రమణ, ముక్తియార్, లక్ష్మీనరసింహ, జేఎం బాషా, గోళ్ల సుధాకర్ నాయుడు, మణికంత బాబు, బెస్త అంజి, రామలింగం తదితరులు పాల్గొన్నారు.

భూ ఆధార్ నమోదును నిలిపియాలి : సీపీఎం

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతు విశిష్ట సంఖ్య (భూ ఆధార్) నమోదు ప్రక్రియను వెంటనే నిలిపేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. భూ ఆధార్ నమోదు ప్రక్రియలో భూమిలేని లక్షలాదిమంది కౌలు రైతులకు ఎలాంటి గుర్తింపు ఉండదన్నారు. చుక్కల భూములున్న రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చూపకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోం దన్నారు. భూ ఆధార్ నమోదు ప్రక్రియను వెంటనే నిలిపేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

అభివృద్ధి పథంలో నడిపించండి

● అహుడా చైర్మన్ టీసీ వరుణ్‌ను కలిసిన ఎంపీ అంబికా



టీసీ వరుణ్‌ను సన్మానిస్తున్న ఎంపీ అంబికా

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : అహుడా చైర్మన్ హోదాలో అనంతపురం, హిందూపురం అర్బన్ డెవలప్మెంట్‌ను అభివృద్ధి పథంలో నడిపించాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అహుడా చైర్మన్ టీసీ వరుణ్‌కు సూచించారు. ఈ మేరకు మంగళవారం టీసీ వరుణ్‌ను ఆయన నివాసంలో కలిసి సన్మానించారు.

రోగుల నుంచి డబ్బు వసూలు చేస్తే ఇంటికే

● ఎంఎన్‌ఓ, ఎఫ్‌ఎన్‌ఓలకు సూపరింటెండెంట్ హెచ్చరిక

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చిన రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తే ఉద్యోగాల నుంచి తప్పించి ఇంటికి పంపుతామని ఎంఎన్‌ఓ, ఎఫ్‌ఎన్‌ఓలకు సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు, ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్, డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునరెడ్డి హెచ్చరించారు. వారు మంగళవారం ఆస్పత్రిలోని సమావేశ మందిరంలో ఎంఎన్‌ఓ, ఎఫ్‌ఎన్‌ఓలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆర్‌ఎంఓ డాక్టరు రామ క్రిష్ణ, డిప్యూటీ ఆర్‌ఎంఓలు డాక్టరు హేమలత, డాక్టరు పద్మజ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆస్పత్రిలో సమస్యలు తలెత్తకుండా సెక్యూరిటీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని అడ్మినిస్ట్రేటర్ డిప్యూటీ కలెక్టరు మల్లికార్జునరెడ్డి సూచించారు. ఆయన మంగళవారం సెక్యూరిటీలతో సమావేశమై పలు సూచనలు చేశారు.

ప్రజారోగ్య పరిరక్షణకే వైద్య పథకాలు

● రాష్ట్ర అడిషనల్ డైరెక్టరు డాక్టరు అనిల్‌కుమార్ ఆదేశాలు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక వైద్య పథకాలు ప్రవేశపెట్టాయని, వాటిని పక్కాగా అమలు చేయాలని వైద్యులు, వైద్య సిబ్బందికి వైద్య శాఖ రాష్ట్ర అడిషనల్ డైరెక్టరు డాక్టరు అనిల్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం జిల్లాకు వచ్చిన ఆయన జిల్లా కేంద్రంలోని ఆదిమూర్తినగర్ అఓ ఉన్న అర్బన్ పీహెచ్‌సీని, రుద్రంపేట పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం జిల్లా వైద్యశాఖ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ డీఎంహెచ్‌ఓ డాక్టరు ఈబీ దేవి, ఇతర ప్రోగ్రామ్ అధికారులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ప్రస్తుతం అమలవుతున్న వివిధ వైద్యపథకాల నిర్వహణ, వాటి ప్రగతి గురించి ఆరాతీశారు. అందరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు. విధి నిర్వహణలో ఎవరు నిర్లక్ష్యం చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ యుగంధర్, గంగాధరరెడ్డి, ఓబులు, నారాయణస్వామి, డెమోలు త్యాగరాజు, గంగాధర్ పాల్గొన్నారు.

టీడీపీతోనే గీత కార్మికులకు న్యాయం

● టీడీపీ ఈడిగ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు గోపాల్ గౌడ్

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే కల్లుగీత కార్మికులకు అన్ని విధాలుగా న్యాయం జరుగుతుందని టీడీపీ ఈడిగ సాధికార సమితి రాష్ట్ర సభ్యుడు గోపాల్ గౌడ్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం కూడేరు మండలం కొర్రకోడులో కల్లుగీత కార్మికులను కలిశారు. టీడీపీ హయాంలో కల్లుగీత కార్మికులకు అందించిన సంక్షేమ పథకాలు, వైసీపీ హయాంలో చేసిన అన్యాయాలపై ఆరా తీశారు. గత వైసీపీ హయాంలో గీత కులాలకు జగన్ చేసిందేమీ లేదన్నారు. కూటమి ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు తిరిగి పలు రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన మతిస్థిమితం లేని ఓ బాలుడిని అనంతపురం రూరల్ పోలీసులు గంటలో తల్లిదండ్రులకు అప్పగించారు. కర్నూలు జిల్లా వెంకయ్యపల్లికి చెందిన నాగలక్ష్మి తన ఇద్దరు పిల్లలతో భిక్షాటన నిమిత్తం సోమవారం అనంతపురం వచ్చింది. మంగళవారం ఉదయం తన పెద్ద కుమారుడైన ప్రభుదేవా తప్పిపోయాడు. 16ఏళ్ల ఆ బాలుడి మితిస్థిమితం సరిగా లేకపోవడంతో ఆందోళన చెందింది. రూరల్ పోలీసులను ఆశ్రయించింది. దీంతో రూరల్ సీఐ శేఖర్, ఎస్ఐ రాంబాబులు ప్రత్యేక బృందాలతో బళ్లారి బైపాస్ సమీపంలో ప్రభుదేవా ఆచూకీ కనుగొని తల్లి నాగలక్ష్మికి అప్పగించారు.

పతకాలు సాధించిన కానిస్టేబుల్‌కు ఎస్పీ అభినందన

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మాస్టర్స్ అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో నాలుగు పతకాలు సాధించిన కళ్యాణదుర్గం కానిస్టేబుల్ షఫీని ఎస్పీ జగదీష్ అభినందించారు. పతకాలు ప్రదానం చేయడంతో పాటు కానిస్టేబుల్‌కు సన్మానం చేశారు. ఈ నెల 7, 8, 9 తేదీల్లో స్థానిక నీలం సంజీవరెడ్డి స్టేడియం మైదానంలో జరిగిన 100మీటర్ల ఈవెంట్‌లో మూడోస్థానం, 200 మీటర్లలో ప్రథమ స్థానం, 400 మీటర్లలో ప్రథమస్థానం, రిలేలో రెండో స్థానంలో నిలిచి మొత్తం నాలు పతకాలన షఫీ సాధించారు. వచ్చే నెల మార్చి 4 నుంచి 9వ తేదీ వరకు బెంగళూరులో నిర్వహించే జాతీయ పోటీలకు అర్హత సాధించాడు.

డీఈఐసీని సందర్శించిన అమెరికా వైద్యుడు



డీఈఐసీలో శిశువులను పరీక్షిస్తున్న బ్రూస్‌స్మిత్

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): అమెరికాకు చెందిన క్యూర్ ఇంటర్నేషనల్ ట్రస్టు ట్రైనర్, ప్రముఖ కేటీవీ వైద్యనిపుణులు బ్రూస్‌స్మిత్ మంగళవారం జిల్లా ఆస్పత్రిలోని డీఈఐసీ సెంటర్‌ను సంర్శించారు. ఆయనకు ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టరు నారాయణస్వామి, మేనేజరు రజిత స్వాగతం పలికారు. పుట్టిన శిశువుల నుంచి 18ఏళ్ల వయసు పిల్లల వరకు డీఈఐసీలో అందిస్తున్న వైద్యసేవలను బ్రూస్‌స్మిత్ పరిశీలించారు. అక్కడే వంకర పాదాలు ఉన్న పసి పిల్లలను పరీక్షించి వైద్యం అందించారు. ఆర్థో విభాగంలో చికిత్స పొందుతున్న వంకరపాదాల పిల్లలకు పీటీపీ, శస్త్రచికిత్సల్లో కొత్తవిధానాలపై ఆర్థోవైద్యులకు ప్రాక్టికల్‌గా అవగాహన కల్పించారు. డీఈఐసీలో అందిస్తున్న వైద్యసేవలను కొనియాడా రు. తమ వంతు సహకారం అందిస్తామని ఆయన హామీఇచ్చారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల సలహాదారు షరీఫ్



చిన్మయ్‌నగర్‌లో స్థలాన్ని పరిశీలిస్తున్న షరీఫ్

రాప్తాడు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మైనార్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల ప్రభుత్వ సలహా దారులు ఎం. షరీఫ్ తెలిపారు. మండలంలోని ప్రసన్నాయపల్లి పం చాయతీ చిన్మయ్‌నగర్‌లో మైనార్టీ విద్యార్థుల కోసం నూతనంగా నిర్మి స్తున్న ఆంధ్రప్రదేశ్ మైనార్టీ రెసిడెన్సియల్ పాఠశాల, పోస్ట్ మెట్రిక్ బాలుర వసతి గృహ భవన నిర్మాణానికి ఆయన మంగళవారం స్థలా న్ని పరిశీలించారు. ఆరున్నర ఎకరం స్థలంలో నిర్మించేందుకు ప్రభు త్వానికి ప్రతిపాదనలు పంపాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి రామసుబ్బారెడ్డిని ఆదేశించారు. భవనం నిర్మించే స్థలంలో ముళ్ల కంపలు తొలగించాలని ఆదేశించారు. అనంతరం జీసస్‌నగర్‌లోని ము స్లిం మైనార్టీ ప్రీ మెట్రిక్ బాలికల వసతి గృహాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమ శాఖ డీఈ రమణారెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గౌస్ మెహిద్దీన్, మైనార్టీ నాయకులు తాజ్. ఫిరోజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాధుల పెంపుతోనే జీవితాల్లో వెలుగులు

● ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



శిక్షణ ముగింపులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాల ద్వారా జీవనోపాధుల పెంపునకు కృషి చేసినప్పుడే పేదల జీవితాల్లో వెలుగులు నిండుతాయని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. డీఆర్‌డీఏ- వెలుగు ద్వారా అమలు చేస్తున్న జీవనోపాధుల పెంపు పథకాలపై స్థానిక రూడ్‌సెట్‌లో 30రోజులుగా సీఆర్‌పీలకు శిక్షణ ఇస్తున్నారు. ముగింపు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మాట్లాడుతూ... స్వీప్ ప్రాజెక్టను శింగనమల నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో అమలు చేయడం శుభ పరిణామమన్నారు. ప్రతి ఇంటినుంచి ఒక ఔత్సాహిక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే సీఎం చంద్రబాబు ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. అనంతరం స్వీప్ ప్రాజెక్టపై సెర్ప్ రాష్ట్ర అదనపు డైరెక్టర్ విజయ్‌కుమార్ సీఆర్‌పీలకు అవగాహన కల్పించారు. శిక్షణ పూర్తి చేసుకున్న సీఆర్‌పీలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య, డీపీఎం గంగాధర్, ఏపీఎం శివప్రసాద్, రూడ్‌సెట్ డైరెక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

గార్లదిన్నె, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొ న్నారు. మండలపరిధిలోని పెనకచెర్ల డ్యాం గ్రామానికి చెందిన పవన్ అనే విద్యార్థికి మంగళవారం రూ. 3.45 లక్షలు విలువ చేసే వినికిడి యంత్రాన్ని ఎమ్మెల్యే అందజేశారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన ఆ పరికరాన్ని ఆమె నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఎమ్మెల్యే శ్రావణిశ్రీకి విద్యార్థి పవన్ తండ్రి రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ నాయకులు చల్లానాగరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెరటి కోళ్ల పెంపకంతో మహిళల ఆర్థికాభివృద్ధి

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పెరటి కోళ్ల పెంపకంతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించ వచ్చని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. మండల కేంద్రంలోని చైతన్య మండలి సమాఖ్య కార్యాలయం వద్ద మంగళవారం 37 మహిళా సంఘాలకు పెరటి కోళ్ల యూనిట్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యేతో పాటు డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య హాజరయ్యారు. తహసీల్దార్ పుణ్యవతి, ఎంపీడీఓ సాల్మన్‌రాజ్, ఏపీఎం నారాయణస్వామి, ఎంపీపీ సునీత, కన్వీనర్ అశోక్, టీడీపీ నాయకులు కేశన్న, రవీంద్ర, లక్ష్మీనా రాయణ, ఎస్ నారాయణస్వామి, ఓబులపతి, పెద్దప్ప, జొన్నా రామయ్య, సోమశేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దళిత ద్రోహి జగన్‌రెడ్డి : ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

శింగనమల, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): దళితులపై దాడి చేసి అవమానించిన వారిని ప్రత్యేకంగా జైలుకు వెళ్లి పరామర్శించడం జగన్‌రెడ్డి నిరంకుశత్వానికి నిదర్శనమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. జగన్ దళిత ద్రోహి అని ఆమె మంగళవారం ఓ ప్రకటనలో విమర్శించారు. జగన్‌రెడ్డి రౌడీ మూకలు దళితులపై రెచ్చిపోయి దాడులకు పాల్పడు తున్నాయన్నారు. ఎస్సీ కులానికి చెందిన వ్యక్తిని కిడ్నాప్ చేసి హింసించిన వంశీని వెనుక వేసుకురావడం హేయమన్నారు. ఎస్సీ ఎస్టీలపై జగన్‌రెడ్డిది కేవలం కపట ప్రేమ అన్నారు.

జగన్‌వి పచ్చి అబద్ధాలు : స్వామిదాస్

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఇప్పటికీ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్ ఒక ప్రకటనలో మండిపడ్డారు. గత ఎన్నికల్లో ప్రజలు ఓటుతో తగిన బుద్ధి చెప్పినా ఇంకా ఆయన మారలేదన్నారు. జగన్ పాలనలో దళితులు, బలహీన వర్గాలపై దాడులు జరిగిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు.

దయ్యాలు వేదాలు వల్లించినట్లు : లక్ష్మీనరసింహ

మాజీ సీఎం జగన్‌రెడ్డి దళితుల ద్రోహి అని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి లక్ష్మీనరసింహ ఒక ప్రకటనలో మండిపడ్డారు. తాను దళితుల పక్షపాతి అని జగన్ మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. వైసీపీ హయాంలో దళితులపై హత్యలు, దాడులు జరిగిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకున్న ఎస్పీ



స్వామిని దర్శించుకున్న ఎస్పీ జగదీష్

ఆత్మకూరు ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో మంగళవారం ఎస్పీ జగదీష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనను ఆలయ మర్యాదలతో ఘనంగా సన్మానించారు. అలాగే ఆది శంకరాచార్య సినిమా హీరో ఉమామహేశ్వర రాజు స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఈఓ బాబు,ప్రదాన అర్చకులు రాముస్వామి తదితరులు పాల్గొన్నారు.

'వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణపై అసెంబ్లీలో చర్చించాలి'

రాప్తాడు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): వాల్మీకులను ఎస్టీలుగా పునరుద్ధరించే విషయమై రానున్న అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని వాల్మీకి బోయ సంఘం నాయకులు మాధవయ్య ఎమ్మెల్యే పరిటాల సునీతను కోరారు. నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆమెను జిల్లా వాల్మీకి బోయ సంఘం నాయకులు కలిశారు. వాల్మీకుల సమస్యలను, వాల్మీకీలను ఎస్టీల పునరుద్ధరణపై అసెంబ్లీలో చర్చించాలన్నారు. వాల్మీకి నాయకులు మణిరవి, క్రాంతి కుమార్, మంజుల, నాగరాజు, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

నీటి వనరుల సద్వినియోగంతోనే మనుగడ

● చీఫ్ కన్జర్వేటర్ యశోదాబాయి

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా ఉన్న నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటేనే మానవ మనుగడ సాధ్యమని చీఫ్ కన్జర్వేటర్ యశోదాబాయి సూచించారు. నీటి వనరుల వినియోగంపై అనంతపురం, కర్నూలు సర్కిల్ అటవీశాఖ సిబ్బందికి బెంగళూరుకు చెందిన వరల్డ్ వెట్ ల్యాండ్ ఫోరం (డబ్లూడబ్ల్యూఎఫ్) సభ్యులు ఫరీదా, శశికళతో స్థానిక ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో మంగళవారం శిక్షణ ఏర్పాటు చేశారు. చీఫ్ కన్జర్వేటర్ యశోదాబాయి మాట్లాడుతూ.. తడి ప్రదేశాలను రక్షించుకోవడం ద్వారా ఎన్నో జీవరాసులను కాపాడుకోగలుగుతామన్నారు. గతంలో ఉన్న కుంటలు, చెరువుల సామర్థ్యాన్ని పెంచుకునే చర్యలు చేపట్టాలన్నారు. అనంతపురం, కడప, చిత్తూరు, శ్రీసత్యసాయి, నంద్యాల డీఎఫ్‌ఓలు విఘ్నేష్, వినీత్ కుమార్, ధరణి, చక్రపాణి, నాగమునేశ్వరి పాల్గొన్నారు.

శ్రీశైలానికి వెళ్లే భక్తులకు నిత్యాన్నదానం

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రిని పురస్కరించుకుని వివిధ రాష్ట్రాలనుంచి శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్లే భక్తుల కోసం బుధవారం నుంచి 25వ తేదీ వరకు సామర్లకోట అడవి మార్గంలో, అలాగే 25 నుంచి 28వ తేదీ వరకు డోర్నాల చెక్‌పోస్టు వద్ద నిత్యాన్నదాన కార్యక్రమం చేపట్టనున్నట్లు ఇస్కాన్ మందిర చైర్మన్ దామోదర్ గౌరంగదాస్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం నగర శివారులోని ఇస్కాన్ మందిరం నుంచి సరుకులతో శ్రీశైలానికి వెళ్తున్న వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు.

అన్నదానం పోస్టర్ల ఆవిష్కరణ

మహాశివరాత్రిని పురస్కరించుకుని సాయి ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 26న జంబుకేశ్వరంలో చేపట్టనున్న అన్నదాన కార్యక్రమ పోస్టర్లను మంగళవారం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ చేతులమీదుగా ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. సాయిట్రస్టు అధ్యక్షుడు విజయసాయి కుమార్, సభ్యులు రాఘవేంద్ర, నారాయణ, ముత్యాలు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధరలు కల్పించాలి

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మిరప, పత్తి, పప్పుశనగ, సీడ్ జొన్నకు రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా పరిషత్ ఆవరణలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కలెక్టర్ వినోద్ కుమార్‌లను కలిసి వినతిపత్రం సమర్పించారు.

జాతీయ హాకీ పోటీలకు జిల్లా క్రీడాకారిణులు



ఎంపికైన నందిని, రేవతి

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ హాకీ పోటీలకు జిల్లాకు చెందిన రేవతి, నందిని అనే ఇద్దరు క్రీడాకారిణులు ఎంపికయ్యారు. వారు హర్యాణాలోని పంచకులలో మార్చి 1వ తేదీ నుంచి నిర్వహించే జాతీయ మహిళా హాకీ చాంపియన్ షిప్- 2025 పోటీలకు ఏపీ రాష్ట్ర హాకీ మహిళా జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. నెల్లూరులో గురువారం నుంచి ఈ నెల 25 వరకు జరిగే క్యాంపులో పాల్గొననున్నారు. జాతీయ పోటీలకు ఎంపికైన నందిని, రేవతికి హాకీ అనంతపురం జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ అభినందనలు తెలిపారు.

కెనరాబ్యాంకు ఉద్యోగుల అవగాహన ర్యాలీ

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ప్రయోజనం కలిగించే పథకాలపై అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కెనరాబ్యాంకు రీజనల్ మేనేజర్ లారెన్స్ తెలిపారు. ఆ బ్యాంకు అధికారులు, ఉద్యోగులు మంగళవారం సాయంత్రం స్థానిక శ్రీనివాసనగర్‌లో ఉన్న కెనరా బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం నుంచి ఆర్ట్స్ కాలేజీ, టవర్‌క్లాక్, సుభాస్‌రోడ్డు, సప్తగిరిసర్కిల్, రాజురోడ్డు, శ్రీకంఠం సర్కిల్ ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు.

నేడు విద్యుత్ అంతరాయం

గార్లదిన్నె, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ విజయ్ కుమార్ తెలిపారు. సబ్ స్టేషన్ మరమ్మత్తుల్లో భాగంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

బీజేవైఎం ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న చీకోటి ప్రవీణ్, బీజేవైఎం నాయకులు

గుంతకల్లుటౌన్,ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి):ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని బీజేవైఎం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర బీజేపీ నాయకుడు చీకోటి ప్రవీణ్ హాజరయ్యారు. ముందుగా బీరప్ప సర్కిల్‌లో భక్త కనకదాసు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం యువకులు నృత్యాల చేస్తూ ఎన్టీఆర్ విగ్రహం వరకు కొనసాగింది. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు మంజుల వెంకటేష్, చక్రీ, కేశవ, రవీంద్ర పాల్గొన్నారు.

ఉరవకొండ : మండల పరిధిలోని బూదగవి వద్ద సూర్యనారాయణస్వామిని బీజేపీ నాయకులు చీకోటి ప్రవీణ్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా వంశీ దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు వారికి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు.

నేడు లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాంపల్లి కొండమీద వెలసిన పెద్దకదిరప్పస్వామి ఆలయంలో బుధవారం లక్ష్మీనరసింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు డి.రామాంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు పానకాభిషేకం, ఉదయం 9 గంటలకు 51 సామూహిక వివాహాలు, సాయంత్రం 4గంటలకు స్వామి రథోత్సవం, గురువారం రాతిదూలం లాగుడు పోటీలను నిర్వహిస్తామని తెలిపారు.

హుండీ సొమ్ము లెక్కింపు

ఉరవకొండ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బూదగవి సూర్యనారాయణస్వామి ఆలయంలో మంగళవారం హుండీ సొమ్మును లెక్కించారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రాణి, ఈవో విజయ్‌కుమార్ సమక్షంలో శాశ్వత హుండీలను తెరిచి లెక్కించారు. రెండు శాశ్వత హుండీల ద్వారా రూ.85,170 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు చిరంజీవి, మహేంద్ర పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

ఉరవకొండ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని నింబగల్లు ప్రాథమిక గొర్రెల పెంపకదారుల సహకార సంఘం అధ్యక్షుడిగా అంజనేయులు ఎన్నికయ్యారు. స్థానిక సచివాలయంలో మంగళవారం ప్రాథమిక గొర్రెల పెంపకదారుల సహకార సంఘం సభ్యుల సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఎర్రెమ్మ, సభ్యులుగా తిప్పన్న, రామచంద్ర, ఓలన్న, హనుమంతు, సుంకన్నను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి మహేష్ వారికి నియామక ఉత్తర్వులు అందజేశారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

యాడికి, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిట్టూరు వద్ద పేకాట ఆడుతున్న ఐదుగురు జూదరులను మంగళవారం అరెస్ట్‌చేసి రూ.5100 నగదు స్వాధీనం చేసుకున్నామని సీఐ ఈరన్న తెలిపారు. మండలకేంద్రంలో మట్కా రాస్తున్న నారాయణస్వామి అనే వ్యక్తిని అరెస్ట్‌చేసి రూ.5వేలు స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

గుత్తి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఈనెల 20న కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మీయా తెలిపారు. ఉదయం 11గంటలకు జరిగే సమావేశానికి ఛైర్మన్, వైస్ ఛైర్మన్, కౌన్సిలర్లు, అధికారులు తప్పక హాజరుకావాలన్నారు.

ఉపాధి పనుల తనిఖీపై గ్రామసభలు

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా 2023-24 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన పనులపై సామాజిక తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కొండయ్య మంగళవారం పేర్కొన్నారు. ఈ నెల 18 నుంచి మార్చి 2 వరకు అన్ని పంచాయతీలలో సామాజిక తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య కేసులో నిందితుల అరెస్ట్

ఉరవకొండ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కుమ్మరవీధిలో నివాసముంటున్న కిషోర్ అనే యువకుడు ఆత్మహత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ జనార్ధననాయుడు మంళవారం తెలిపారు. ఈ నెల 8న నలుగురు వ్యక్తులు కలిసి డబ్బుల విషయంలో కిషోర్‌ను తిట్టి, ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించారన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు 9న కేసు నమోదు చేశామన్నారు. నలుగురు నిందతుల్లో కేదార్‌నాథ్, హరికృష్ణ అనే ఇద్దరిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచామన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంకు మంగళవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అవుట్‌సోర్సింగ్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, పర్మినెంట్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న సరెండర్‌లీవ్, మూడు డీఏలను వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నరసయ్య, చిన్నకొండయ్య, చెన్నయ్య, చిన్న శ్రీనివాసులు, వెంకటేశులు, కార్తీక్ పాల్గొన్నారు.

ఉపాధి పనులను పరిశీలించిన డ్వామా పీడీ

పెద్దవడుగూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంతోపాటు మిడుతూరు గ్రామంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా నిర్మించిన కమ్యూనిటీ సోక్‌పిట్‌ను డ్వామా పీడీ సలీంబాషా పరిశీలించారు. అనంతరం కూలీలు చేపడుతున్న పని ప్రదేశానికి వెళ్లి హాజరుపట్టికను పరిశీలించారు. నిబంధనల మేరకు పనులు చేసినప్పుడే నిర్దేశించిన కూలీ వస్తుందని సూచించారు. టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ సలీంబాషా

'దుర్గం' రైల్వేస్టేషన్‌లో సౌకర్యాలు కల్పించండి

● డీఆర్ఎంకు కాలవ వినతి



డీఆర్ఎంకు వినతిపత్రం అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాలవ

రాయదుర్గం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్‌లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని హుబ్లీ డివిజన్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) బేలామీనాకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. హుబ్లీలోని డివిజన్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం డీఆర్ఎంను కలిసి వివిధ సమస్యలపై కాలవ వినతిపత్రం సమర్పించారు. రైల్వేస్టేషన్ కొత్త భవనంలో కనీస వసతుల కల్పనకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రయాణీకుల విశ్రాంతి భవనాన్ని విస్తరించాలనీ, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రయాణీకులకు 24 గంటలు సమాచారం అందేలా వ్యవస్థ మెరుగుపరచాలనీ, సమాచార బోర్డులో రైళ్ల రాకపోకల సమగ్ర వివరాలు పొందుపరచాలన్నారు. రైళ్లు ఆగినపుడు కోచ్ పొజిషన్ తెలియజేసే ఎలక్ట్రానిక్ బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. రైల్వే క్యాటరింగ్ ద్వారా అల్పాహార సౌకర్యం, రాయదుర్గం పట్టణ పరిధిలో రైల్వే ట్రాక్‌కు ఇరువైపులా పశువుల నియంత్రికలు ఏర్పాటు చేయాలని కోరారు. కొవిడ్ సమయంలో రద్దయిన తిరుపతి-కదిరిదేవరపల్లి రైలును ప్రస్తుతం గుంతకల్లు వరకే పరిమితం చేశారనీ, రాయదుర్గం, బళ్లారి మీదుగా పునరుద్ధరించాలని కోరారు. హోస్పేట్, బెంగుళూరు మధ్య నడుస్తున్న రైలును పునరుద్ధరించాలన్నారు. రాయదుర్గం మీదుగా వెళ్తున్న యశ్వంత్‌పూర్-టాటానగర్, మైసూరు-టాటానగర్, యశ్వంత్‌పూర్-జైపూర్ రైళ్లను రాయదుర్గం స్టేషన్‌లో ఆపాలని కోరారు. బళ్లారి నుంచి రాయదుర్గం, కళ్యాణదుర్గం మధ్య ప్రత్యేక డెమో ట్రైన్ నడపాలని విన్నవించారు. హైద్రాబాద్, సికింద్రాబాద్ నుంచి మైసూరు, బెంగళూరు, మంగళూరు వరకు కొత్త రైళ్లు నడపాలని కోరినట్లు కాలవ వివరించారు.

బీటీపీ కాలువలో పడి బాలుడి మృతి

గుమ్మఘట్ట, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేలోడు గ్రామంలో మంగళవారం సాయంత్రం బీటీపీ కాలువలో పడి జానీ (7) మృతిచెందాడు. గ్రామస్థులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బేలోడుకు చెందిన రత్నమ్మను మండలంలోని గలగల గ్రామవాసి లోకేశ్ ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు కుమారులు. రత్నమ్మ అనారోగ్యంతో మూడేళ్ల క్రితం మరణించింది. లోకేశ్ బెంగళూరుకు పనుల కోసం వలస వెళ్లాడు. పెద్ద కుమారుడు లోకేశ్ సంరక్షణలో ఉన్నాడు. చిన్న కుమారుడు జానీ బేలోడులో అమ్మమ్మ హనుమక్క వద్ద ఉంటుండేవాడు. ఈ నేపథ్యంలో జానీ మంగళవారం సాయంత్రం మిత్రులతో కలిసి గ్రామం పక్కనే ఉన్న బీటీపీ కాలువలో చేపల కోసం గాలం వేస్తూ ప్రమాదవశాత్తు కాలుజారి కాలువలో పడ్డాడు. గమనించిన మిత్రుడు కేకలు వేస్తూ గ్రామంలోకి వెళ్లి చెప్పాడు. అక్కడివారు పరుగున వెళ్లి బాలుడిని కాలువలో నుంచి వెలికి తీసి రాయదుర్గం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు చికిత్సలు అందించేలోగా బాలుడు మరణించాడు.

ప్రజలు స్వేచ్ఛా వాతావరణంలో జీవిస్తున్నారు: షరీఫ్

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో ఐదేళ్లపాటు ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారని, కూటమి ప్రభుత్వంలో స్వేచ్ఛావాతావరణంలో జీవిస్తున్నారని శాసనమండలి మాజీ చైర్మన్, ప్రభుత్వ సలహాదారుడు షరీఫ్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రజావేదిక వద్ద ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుతో కలసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ.. జగన్ ప్రభుత్వం తనను ఎంతగా ఇబ్బంది పెట్టినా బెదరకుండా సమర్థవంతంగా నిలబడి ప్రజల కోసం పాటుపడ్డానన్నారు. కూటమి ప్రభుత్వం మసీదుల అభివృద్ధి కోసం రూ. 42 కోట్లు విడుదల చేసిందన్నారు. ఇంకా నియోజకవర్గాల్లో చాలా చోట్ల ఈద్గాలు, ముస్లిం స్మశానవాటికలకు అవసరమైన చోట అధికారులతో మాట్లాడి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేస్తోందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంటును వైసీపీ ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలని చూసిందని కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆర్థిక ప్యాకేజీ తీసుకువచ్చి ప్రైవేటీకరణ కాకుండా ఆపారన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం 40కి పైగా పరిశ్రమలు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. సమావేశంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్ మోహిద్దీన్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎంఏ షరీఫ్, సురేంద్రబాబు

పార్టీ కోసం శ్రమించినవారికే గుర్తింపు: ఎమ్మెల్యే

గుంతకల్లు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పార్టీ అభివృద్ధికి శ్రమించినవారికి తప్పక గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని పరిటాల శ్రీరాములు కల్యాణమండపంలో జేఎఫ్‌సీఎం కోర్టు ఏజీపీగా నియమితుడైన న్యాయవాది హేమాద్రిని సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల్లో టీడీపీ గెలవడానికి ఎందరో కార్యకర్తలు చిత్తశుద్ధితో పనిచేశారని, వారందరిని పార్టీ తప్పక గుర్తిస్తుందన్నారు. క్రియాశీలకంగా పనిచేసిన హేమాద్రికి ఏజీపీ పదవి లభించడం సముచితం అన్నారు. అనంతరం ఏజీపీ హేమాద్రిని, ఎమ్మెల్యేను టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, నారాయణ, ఆనంద్, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, వెంకటేశులు, మస్తానప్ప, హిమబిందు, ఖాజా, అంజి, కదిరప్ప, కొలిమి రామాంజనేయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

సంక్షేమానికి చంద్రబాబు పెద్దపీట

రాష్ట్రంలో అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పెద్దపీట వేశారని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఆర్థిక సాయాలను పంపిణీచేశారు. 18 మందికి మంజూరైన రూ. 30.54 లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

కసాపురంలో ప్రాకారోత్సవం



ప్రాకారోత్సవం నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం రాత్రి అంజనేయస్వాటమికి ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. రాత్రి వెండి రథంలో ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తిని కొలువుదీర్చారు. పూజలు చేసి మేళతాళాల మధ్య ఆలయ ప్రాంగణంలో ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు.

పదిలో ఉత్తీర్ణత పెంచాలి : డీఈఓ

కూడేరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని డీఈఓ ప్రసాద్ బాబు తెలిపారు. మంగళవారం కూడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులతో వందరోజుల ప్రణాళిక, ఉత్తీర్ణతపై చర్చించారు. గత ఏడాది 74 శాతం పాస్ అయ్యారని, ఈ ఏడాది ఎక్కువ శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధిస్తారని హెచ్ఎం తెలిపారు. వందరోజుల ప్రణాళిక పూర్తి చేశామని, ప్రతి రోజు విద్యార్థులకు పరీక్షలు రాయిస్తున్నామన్నారు.

రీసర్వే పకడ్బందీగా చేయాలి

కూడేరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వే పకడ్బందీగా నిర్వహించాలని అసిస్టెంట్ కలెక్టర్, కూడేరు ట్రైనీ తహసీల్దారు వినూత్న తెలిపారు. మండలంలోని జయపురంలో జరుగుతున్న భూముల రీసర్వేను ఆమె మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రీ సర్వే బృందంతో మాట్లాడుతూ.. భూముల కొలతలు వేసిన తర్వాత హద్దులు పక్కాగా ఉండాలని, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సర్వే నిర్వహించాలన్నారు. అనంతరం రీసర్వే ప్రదేశంలో రైతులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉరవకొండ తహసీల్దారు మహబూబ్ బాషా, రీసర్వే డిప్యూటీ తహసీల్దారు ప్రసాద్, సర్వేయర్ అయేషా సిద్ధిఖీ పాల్గొన్నారు.

పార్కు స్థలం ఆక్రమణలపై నోటీసులు

కూడేరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పార్కు స్థలాన్ని ఆక్రమించుకొని షెడ్డు నిర్మాణం చేస్తుండటంతో రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. స్థానికులు ఫిర్యాదు చేయడంతో మంగళవారం తహసీల్దార్ మహబూబ్‌బాషా, వీఆర్‌ఓలు రమేష్, ఎర్రమ్మ పరిశీలించారు. వారం రోజుల్లో తొలగించకపోతే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దారు పేర్కొన్నారు. పార్కు స్థలాన్ని కాజేసేందుకు వైసీపీ నాయకులు నకిలీ పట్టాలు సృష్టించారని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని దళితులు సీఐ రాజుకు వినతిపత్రం అందజేశారు.

ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ

గుత్తి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. రోగులపట్ల మెరుగైన వైద్య సేవలను అందించాలన్నారు. అనంతరం వైద్యులతో పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ పంటకు నిప్పు : రూ.లక్ష నష్టం



అగ్నికి ఆహుతవుతున్న వేరుశనగ పొలం

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : కంబదూరు మండలం నూతిమడుగు గ్రామంలోని శివరాజు అనే రైతుకు చెందిన వేరుశనగ పంట మంగళవారం అగ్నికి ఆహుతయింది. ఆకతాయిలు పంటకు నిప్పు పెట్టడంతో పూర్తిగా వేరుశనగ పంటంతా మంటల్లో కాలి బూడిదైంది. దీంతో రూ. లక్ష వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితుడు తెలిపారు.

మామిడి తోటకు..



కాలిపోయిన మామిడి చెట్లు, స్టార్టర్ బాక్సు

బ్రహ్మసముద్రం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సూగేపల్లిలోని ధనుంజయకు చెందిన మామిడి చెట్లకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో డ్రిప్ పరికరాలతో పాటు మామిడి చెట్లు, స్టార్టర్ బోర్డు పూర్తిగా కాలిపోయింది. దీంతో రూ. రెండు లక్షలు వరకు ఆస్తి నష్టం వచ్చిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పారు.

రోడ్డు విషయంలో అధికారులతో వాగ్వాదం

తాడిపత్రి, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొందలదిన్నె గ్రామంలో ఫోర్‌లైన్ రోడ్డు వేస్తున్న సందర్భంగా సర్వీసురోడ్డు విషయంలో గ్రామస్థులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. రోడ్డుకు అడ్డంగా ట్రాక్టర్లు పెట్టి ట్రాఫిక్ అంతరాయం కలిగించారు. తాడిపత్రి వైపు నుంచి వెళ్లే వాహనాలు దాదాపు వంగనూరు వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది. కడప వైపు నుంచి వచ్చే వాహనాన్ని తాళ్లప్రొద్దుటూరు వరకు ఉండడంతో రూరల్ సీఐ శివగంగాధర్ రెడ్డి అధికారులు, ప్రజలతో చర్చించి సమస్యను పరిష్కరించారు.

ప్రభుత్వ స్థలమని తేల్చినా వదలని వైసీపీ నేతలు

కుందుర్పి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కరిగానపల్లి శ్మశానం తమదేనని ఖననాన్ని అడ్డుకున్నారు. ఈ కథనం పేపర్లలో ప్రచురితం కావడంతో రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. తొమ్మిది ఎకరాలకు పైగా ప్రభుత్వ స్థలంగా గుర్తించారు. శ్మశాన వాటిక ఏర్పాటు చేసి హద్దులు చూపే క్రమంలో మంగళవారం రెవెన్యూ అధికారులు గ్రామ సర్పంచ్, ఎక్స్‌కవేటర్‌తో కంపచెట్లను తొలగిస్తుండగా వైసీపీ నాయకులు అడ్డుకున్నారు. ఈ స్థలం తమదేనని అధికారులను లెక్కచేయకుండా పనులను అడ్డుకున్నారు.

అంగన్‌వాడీలే అక్షర పునాదులు

(న్యూస్ నెట్‌వర్క్- ఆంధ్రజ్యోతి)

అంగన్‌వాడీ కేంద్రాల్లోనే చిన్నారులకు అక్షరాల పునాది వేయాలని అసిస్టెంట్ కలెక్టర్, కూడేరు ట్రైనీ తహసీల్దారు వినూత్న సూచించారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఐసీడీఎస్, ఎస్ఎస్ఏ సంయుక్తంగా నిర్వహించిన అక్షరాలు, సంఖ్యా జ్ఞానం (ఎఫ్ఎల్ఎన్)పై అంగన్‌వాడీల శిక్షణ తరగతులను కూడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ.. చిన్నారులకు ప్రాథమిక దశలోనే చదవడం, రాయడం, గణిత నైపుణ్యం పెంపొందించేందుకు అంగన్‌వాడీల్లో పునాదులు వేయాలన్నారు. డీఈఓ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ.. చిన్నారులకు అర్థమయ్యే విధంగా ఆటల పాటలతో చదువులు చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏపీసీ శైలజ, ఐసీడీఎస్ పీడీ వనజ అక్కమ్మ, సీడీపీఓ శ్రీదేవి, ఎంఈఓలు మహమ్మద్ గౌస్, సాయికృష్ణ, హెచ్ఎం శ్రీదేవి పాల్గొన్నారు. కణేకల్లు శిక్షణ కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మణ్ణ, ఇన్‌చార్జ్ సీడీపీఓ లక్ష్మీప్రసన్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమాదేవి, గీత, శాంత పాల్గొన్నారు. యాడికిలో ఎంఈఓ కాశప్ప మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నప్పటి నుంచి మంచి అలవాట్లను నేర్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 ధనలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి పాల్గొన్నారు. రాయదుర్గం ఎంఈఓ నాగమణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ పలు సూచనలు ఇచ్చారు. బ్రహ్మసముద్రంలో ఎంఈఓలు ఓబుళపతి, కృష్ణానాయక్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. బెళుగుప్ప ఎంఈవో మల్లారెడ్డి, హెచ్ఎం వెంకటప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సురేఖ పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

రీసర్వే భూములను పరిశీలించిన కలెక్టర్




సచివాలయంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

పుట్లూరు, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరేపల్లిలో రీసర్వే భూములను మంగళవారం కలెక్టర్ వినోద్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా సూరేపల్లి రెవెన్యూలో ఎల్‌పీఎంనెంబరు 167 సర్వే నెంబరులో 6.04 ఎకరాలు ఉంది. వీటికి సంబంధించి ఎల్పీయం సబ్ డివిజన్ చేయమని గ్రామసభలో అర్జీ ఇవ్వడంతో ఆ మేరకు సరిహద్దులు కేటాయించినట్లు తహసీల్దార్ శేషారెడ్డి తెలిపారు. భూముల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. అనంతరం అరకటవేముల సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సచివాలయాల ఉద్యోగులు రోజువారీ బయోమెట్రిక్ తప్పనిసరిగా వేయాలన్నారు. అనంతరం వివిధ రకాల సేవలకు సంబంధించి సర్వీసుల నగదును రెండురోజుల్లో ప్రభుత్వానికి జమచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కేశవనాయుడు, ఎంపీడీఓ అలివేలమ్మ పాల్గొన్నారు.

యాడికి : భూ సమస్యల పరిష్కారానికి రీసర్వే సరైన మార్గం అని గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్ తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్ కింద మండలంలోని చందన రెవెన్యూ పంచాయతీలో జరుగుతున్న రీసర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి చక్కటి మార్గం రీసర్వే అని తెలిపారు. భూ యజమానులంతా రీసర్వేకు సహకరించి సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. తప్పిదాలకు ఆస్కారం లేకుండా రీసర్వే చేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, డిప్యూటి తహశీల్దార్ (రీసర్వే) రాజ్‌కుమార్, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సంలో పాల్గొన్న ఎమ్మెల్యే



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని కడప రహదారిలో ఉన్న భ్రమరాంబికా మల్లికార్జునస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో మంగళవారం ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయం కలియతిరిగి సమస్యలు ఉంటే తెలపాలని నిర్వాహకులను కోరారు. అంతకుమునుపు ఎమ్మెల్యేకు నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు.

రైతుల పొలాల్లో కేబుల్‌వైరు చోరీ

యాడికి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని చందన గ్రామంలో సోమవారం రాత్రి దొంగలు పడి ఐదుగురు రైతుల వ్యవసాయ బోరుబావుల కేబుల్‌వైరు ఎత్తుకెళ్లారు. చందన గ్రామానికి చెందిన రమేష్, నాగేంద్ర, మధు, రామకృష్ణ, ఓంకారయ్య బోరు బావుల కింద అరటి, మొక్కజొన్న తదితర పంటలను సాగు చేస్తున్నారు. సోమవారం సాయంత్రం వరకు తోటల వద్ద ఉన్న రైతులు రాత్రి ఇంటికి వెళ్లారు. మంగళవారం ఉదయం తోటల వద్దకు వచ్చి చూస్తే బోరుబావుల కేబుల్‌వైరు కత్తిరించుకొని వెళ్లారని బాధిత రైతులు తెలిపారు. కేబుల్‌వైరు చోరీలను పోలీసులు పట్టించుకోకపోవడం వలన దొంగలు మరింత రెచ్చిపోతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. చందన, దైవాలమడుగు, రాయలచెరువు ప్రాంతాల్లోనే కేబుల్‌వైరు చోరీలు వందకు పైగానే జరిగాయని, పోలీసులు ఒక్క కేసు కూడా నమోదు చేయలేదని రైతులు తెలిపారు.

పురుగుమందుల దుకాణాల్లో తనిఖీలు

కుందుర్పి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కుందుర్పిలోని శ్రీవెంకటేశ్వరి ఫర్టిలైజర్స్ షాపుపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వాసుప్రకాష్, సద్గురుడు సిబ్బంది తనిఖీ నిర్వహించారు. పురుగు మందుల లేబుల్స్‌లపై తయారీతేది, ఎక్స్‌పైరీ తేదీ ముద్రించకపోవడం, కాలం చెల్లిన పురుగు మందులు ఉన్నట్లుగా గుర్తించారు. రూ. 33,791 విలువ గల 15.40 కిలోల పురుగు మందులను జప్తు చేసి స్థానిక మండల వ్యవసాయాధికారికి తదుపరి చర్యల నిమిత్తం అప్పగించారు.

మల్లేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.58 లక్షలు



హుండీని లెక్కిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి గాంచిన కంబదూరు కమల మల్లేశ్వర స్వామి హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని మంగళవారం దేవదాయ శాఖాధికారులు నిర్వహించారు. 2024-25 సంవత్సరంలో భక్తులు స్వామివారికి సమర్పించిన కానుకలు, హుండీను ఆలయంలో లెక్కించారు. మొత్తం రూ. 2,58,858 ఆదాయం లభించినట్లు ఈవో దేవదాస్, ఇన్‌స్పెక్టర్ వన్నూరుస్వామి తెలిపారు. దీంతో పాటు 1 గ్రాము బంగారు నాణెం, 33 లక్ష్మీ గణపతి దేవతామూర్తులు కలిగిన వెండి నాణేలు భక్తులు సమర్పించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీరాములు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిగాంచిన కంబదూరు కమల మల్లేశ్వరస్వామి ఆలయం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికలను మంగళవారం ఈవో దేవదాసుతో కలిసి గ్రామపెద్దలు ఆవిష్కరించారు. ఈ నెల 19 నుంచి 26 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతున్నట్లు ఆలయ అధికారులు తెలియజేశారు. మహాశివరాత్రి సందర్భంగా మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

వరకట్న వేధింపులపై ఫిర్యాదు

కూడేరు, ఫిబ్రవరి 18, (ఆంధ్రజ్యోతి): వరకట్నం కోసం అత్తారింటి వేధింపులు భరించలేక ఓ మహిళ కూడేరు పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు తెలిపిన మేరకు.. కూడేరుకు చెందిన మేఘన హిందూపురం మండలం బలంపల్లికికి చెందిన రఘువీరరెడ్డి కియా కంపెనీలో పనిచేస్తూ ప్రేమించుకున్నారు. పెద్దలను ఒప్పించి 2022లో పెళ్లి చేసుకున్నారు. వీరికి ఏడాది కుమారుడు ఉన్నాడు. కట్నం తీసుకురావాలని మేఘన భర్త రఘువీరారెడ్డి, అత్త సువర్ణమ్మ, మామ అమరనారాయణరెడ్డి వేధింపులకు పాల్పడటంతో కూడేరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు భర్త, అత్త, మామలపై కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.